teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 394 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | శుక్రవారం | 7 జూన్ 2024 | పేజీలు : 08 | వెల ‹ 5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## చంద్రబాబుకి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు

కార్యక్రమంలో పాల్గొన్న నరేందర్ రెడ్డి, మంత్రులు సీతక్క, ఎంపీ బలరాంనాయక్



తెలంగాణ బ్యూరో, జూన్ 06 (తీన్మార్ న్యూస్): ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. చంద్రబాబుకు

మిగతా 2 లో



## మోడీ, అమిత్ షాపై రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు

స్టాక్ మార్కెట్ల కుంభకోణానికి పాల్పడ్డారంటూ వ్యాఖ్యలు

స్టాక్ మార్కెట్ల స్కామ్‌పై జేపీసీతో విచారణ జరిపించాలని డిమాండ్

న్యూ ఢిల్లీ, జూన్ 06 (తీన్మార్ న్యూస్): మోడీ, అమిత్ షాపై కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. స్టాక్ మార్కెట్ల కుంభకోణానికి పాల్పడ్డారని తీవ్ర ఆరోపణలు చేశారు. రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడారు. స్టాక్ మార్కెట్ల స్కామ్‌పై జేపీసీతో విచారణ జరిపించాలని డిమాండ్

మిగతా 2 లో

# ఎవరిని వరించేనో అమాత్య యోగం

## చర్చానియామశంగా మారిన కేంద్రంలో "రాష్ట్ర" మంత్రులు

## కేబినెట్ రేసులో గెలిచిన "బీజేపీ" 8మంది ఎంపీలు

హాట్ టాపిక్ గా మారిన కేంద్ర మంత్రుల ప్రాధాన్యత రాష్ట్రానికి రానున్న పదవుల సంఖ్య ఎన్ని





తెలంగాణ బ్యూరో, జూన్ 06 (తీన్మార్ న్యూస్): కేంద్రంలో నరేంద్ర మోదీ నేతృత్వంలో ఎన్డీఏ సర్కారు రెండు మూడు రోజుల్లోనే ఏర్పడనుంది. 2024 లోక్ సభ ఎన్నికల్లో రాష్ట్రం నుంచి ఎనిమిది మంది ఎంపీలను బీజేపీ గెలుచుకుంది. ఈ సారి విజయం సాధించిన వారంతా కేంద్ర కేబినెట్ రేసులో ఉన్నారు. గతంలో కంటే బీజేపీకి సీట్లు తక్కువ రావడంతో లోక్ సభలో పూర్తి స్థాయి మెజార్టీ లేకపోయింది. ప్రస్తుతం 241 సీట్లు మాత్రమే గెలుచుకోవడంతో అధికారం చేపట్టాలంటే ఎన్డీఏలోని పక్షాల మద్దతు తప్పని సరి అయ్యింది, సహకరిస్తేనే

మిగతా 2 లో





## కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు అనంతరం తెలంగాణకు కొత్త గవర్నర్

### రాజ్యసభకు తమిళిసై.. కేబినెట్‌లోకి తీసుకునే చాన్స్

తెలంగాణ బ్యూరో, జూన్ 06 (తీన్మార్ న్యూస్): కేంద్రంలో ఏర్పాటు కాబోయే సంకీర్ణ ప్రభుత్వం తెలంగాణకు త్వరలో పూర్తిస్థాయి గవర్నర్ ను నియమించనుంది. ప్రస్తుత ఇన్ చార్జ్ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ పుదుచ్చేరి, జార్ఖండ్ గవర్నర్‌గా కొనసాగుతున్నారు. దీంతో మూడు రాష్ట్రాల మధ్య పర్యటించాల్సి వస్తోందని, ఇది కొంత ఇబ్బందిగా ఉందని రాధాకృష్ణన్ పలు కార్యక్రమాల్లో

మిగతా 2 లో



## భాగ్యనగరంలో విద్యుత్ సరఫరా నిలిపివేత

పలు చోట్ల వర్షం కురుస్తోండటంతో తప్పని నిర్ణయం

అత్యవసర పరిస్థితులకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు

హైదరాబాద్, జూన్ 06 (తీన్మార్ న్యూస్): గ్రేటర్ హైదరాబాద్‌లో భారీ వర్షం పడుతోంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తోండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫిలింనగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్,

మిగతా 2 లో

## 2రోజుల్లో విడుదలకానున్న టీచర్ల బదిలీ పదోన్నతుల షెడ్యూల్

### ప్రకటన విడుదల చేసిన విద్యాశాఖ కార్యదర్శి బుర్ర వెంకటేశం



హైదరాబాద్, జూన్ 06 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ఉపాధ్యాయ బదిలీల, పదోన్నతులకు సంబంధించిన షెడ్యూల్ ని మరో రెండు రోజుల్లో విడుదల చేస్తామని విద్యాశాఖ కార్యదర్శి బుర్ర వెంకటేశం తెలిపారు.జూన్ 7వ తేదీ నుంచి 20వ తేదీ వరకు బదిలీల, పదోన్నతుల ప్రక్రియను చేపడతామని



## రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన బడిబాట

### ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్యను పెంచడమే లక్ష్యం


.. వివరాలు 2లో

## ఈ నెల 8నుంచి హైదరాబాద్‌లో చేప ప్రసాదం పంపిణీ

నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో విస్తృత ఏర్పాట్లు

చేప మందుకు వచ్చే వారి కోసం టీజీఎస్ ఆర్టీసీ శుభవార్త

130 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ఆర్టీసీ ప్రకటన



హైదరాబాద్, జూన్ 06 (తీన్మార్ న్యూస్): మృగశిరకార్తె ప్రారంభం కానున్నదున ఈ నెల 8నుంచి హైదరాబాద్‌లో చేప ప్రసాదం పంపిణీ నిర్వహించనున్న సంగతి తెలిసిందే. ఈ చేపమందు ప్రసాదం అందించేందుకు నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆస్తమాతో సహా శ్వాస సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారికి ఈ చేప మందు ఉచితంగా పంపిణీ చేయనున్నారు. ప్రతి సంవత్సరం బత్తిని ఫ్యామిలీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చేప ప్రసాదానికి

మిగతా 2 లో

## లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన వారిలో మెజారిటీ సభ్యులు కొత్తవారే

### ఏకంగా తొలిసారి ఎంపీలుగా 280 మంది



తెలంగాణ బ్యూరో, జూన్ 06 (తీన్మార్ న్యూస్): లోక్‌సభ ఎన్నికల్లో గెలుపొందిన వారిలో మెజారిటీ సభ్యులు కొత్తవారే కనిపించనున్నారు. తాజా ఎన్నికల్లో ఏకంగా 280 మంది తొలిసారి ఎంపీలుగా గెలిచారు. ఉత్తరప్రదేశ్ నుంచి 45, మహారాష్ట్ర నుంచి 33 మంది గరిష్ఠంగా ఎన్నికయ్యారు. కొత్తగా లోక్‌సభలో అడుగుపెట్టే వారిలో మాజీ సీఎంలు శివరాజ్‌సింగ్, బొమ్మై, మనోహర్ లాల్ వంటి వారితోపాటు

మిగతా 2 లో



## తెలంగాణ ప్రజలు బీజేపీని కోరుకుంటున్నారు

### లోక్ సభ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ బలం పెరిగింది

### బీజేపీ ఎంపీగా గెలిచిన కిషన్ రెడ్డి వాఖ్యలు

న్యూ ఢిల్లీ, జూన్ 06 (తీన్మార్ న్యూస్): లోక్ సభ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ బలం పెరిగిందన్నారు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి. తెలంగాణ ప్రజలు బీజేపీని కోరుకుంటున్నారు. ప్రతి ఎన్నికల్లో బీజేపీకి ఓటింగ్ శాతం పెరుగు తూ వస్తోంది. బీఆర్ ఎస్ ను వద్దనుకొని బీజేపీకి ఓటేశారని చెప్పారు. తెలంగాణలో 8సీట్లు గెలిచాం..7 సీట్లలో రెండో స్థానంలో ఉన్నాం ఎంపీ ఎన్నికల్లో బీఆర్ ఎస్ పత్తా లేకుండా పోయిందన్నారు. చాలా చోట్లు బీఆర్ ఎస్ కు డిపాజిట్లు రాలేదన్నారు. సీఎం సొంత నియోజకవర్గంలో కూడా

మిగతా 2 లో




## ఉద్యోగుల నుంచి ఫిర్యాదుల స్వీకరణ కోసం వెబ్ పోర్టల్

### ఏర్పాటు చేసిన తెలంగాణ ప్రభుత్వం

### జీవో 317, 46 బాధితులకు న్యాయం చేస్తామని రేవంత్ రెడ్డి హామీ

.. వివరాలు 2లో

## నేటి నుంచి పునఃప్రారంభంకానున్న ప్రజావాణి

### ప్రజావాణి ఇంచార్జీ డాక్టర్ జీ చిన్నారెడ్డి




హైదరాబాద్, జూన్ 06 (తీన్మార్ న్యూస్): నేటి నుంచి ప్రజావాణి పునఃప్రారంభం కానుంది. లోక్ సభ ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ వల్ల తాత్కాలిక వాయిదా పడింది. అయితే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ముగిసినందున తిరిగి ప్రారంభించనున్నారు. ఈ విషయాన్ని ప్రజావాణి ఇంచార్జీ, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ చిన్నారెడ్డి వెల్లడించారు. ప్రజావాణి అర్జీల స్వీకరణ కార్యక్రమం శుక్రవారం నుంచి పునః ప్రారంభం

మిగతా 2 లో

## ఇండియా కూటమిపై తెలంగాణ మంత్రి సీతక్క ట్విట్టర్ ట్వీట్

### కాంగ్రెస్ నేతృత్వంలో కూటమి ఆగిపోవడంపై స్పందించిన సీతక్క



హైదరాబాద్, జూన్ 06 (తీన్మార్ న్యూస్): లోక్‌సభ ఎన్నికల్లో విజయానికి దగ్గరలో కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి ఆగిపోవడంపై ఆ పార్టీ నేత, తెలంగాణ మంత్రి సీతక్క ట్విట్టర్ వేదికగా స్పందించారు. ఇదిలా ఉంటే పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజా భవన్ లో ఆమె మొక్కలను నాటారు. జీవించడానికి పర్యావరణం చాలా ముఖ్యమైనదని చెప్పారు. వాతావరణం

మిగతా 2 లో

## కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు అనంతరం తెలంగాణకు కొత్త గవర్నర్

**మొదటి పేజీ తరువాయి**

చెప్పారు. మార్చి 19న తెలంగాణ గవర్నర్ తమిళిసై రాజీనామా నేపథ్యంలో జార్ఖండ్ గవర్నర్ రాధాకృష్ణన్ కు అదనంగా తెలంగాణ, పుదుచ్చేరిల ఇన్‌చార్జి బాధ్యతలను కేంద్రం అప్పగించింది. ఎన్నికలు పూర్తికావటంతో త్వరలో ప్రధాని, కేంద్రమంత్రి మండలి, కొత్త ఎంపీల ప్రమాణ స్వీకారం తరువాత పలు రాష్ట్రాలకు కేంద్రం గవర్నర్లను నియమించనుంది. అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న వారికి ఇన్ చార్జ్ బాధ్యతలు తొలగించి ఆ స్థానాల్లో కొత్త గవర్నర్లను నియమించనుంది. ఇటీవల ఎన్నికల్లో టికెట్ నిరాకరించిన సిట్టింగ్ ఎంపీలకు ప్రస్తుతం గవర్నర్లుగా అవకాశం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

**కేంద్ర మంత్రులుగా తమిళిసై, అన్నామలై**

ఇటీవలి దాకా రాష్ట్ర గవర్నర్ గా వ్యవహరించిన తమిళిసైకు బీజేపీ హైకమాండ్ కేంద్ర మంత్రిగా అవకాశం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. గవర్నర్ పదవికి రాజీనామా చేసి చెన్నై సౌత్ నుంచి ఆమె పోటీ చేసిన విషయం తెలిసిందే. అయితే, డీఎంకే అభ్యర్థి చేతిలో తమిళిసై ఓటమి పాలయ్యారు. ఈ నేపథ్యంలో తమిళిసైని రాజ్యసభకు పంపించి, ఆపై కేబినెట్ లోకి తీసుకోవాలని బీజేపీ పెద్దలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. లోక్ సభ ఎన్నికల్లో గెలిచిన రాజ్యసభ సభ్యులు పలువురు రాజీనామా చేయనుండడంతో ఏదో ఒక స్థానం నుంచి తమిళిసైని నిలబెట్టాలని నిర్ణయించినట్లు సమాచారం. కాగా, పార్టీ తమిళనాడు చీఫ్ అన్నామలైని కూడా కేంద్ర కేబినెట్ లోకి తీసుకునే అవకాశాన్ని బీజేపీ పెద్దలు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

## భాగ్యనగరంలో విద్యుత్ సరఫరా నిలిపివేత

**మొదటి పేజీ తరువాయి**

షేక్ పేట్, గోల్కొండ, టోలిచౌకి, మెహదీపట్నం, ఖైరతాబాద్, పంజాగుట్ట, లక్డీకపూల్, ముషీరాబాద్, చిక్కడపల్లి, రాంనగర్, అశోక్ నగర్, బషీర్ బాగ్, అబిడ్స్, కోటి, సుల్తాన్ బజార్, బేగం బజార్, అఫ్జల్ గంజ్, నాంపల్లి,మంగళ్ హాట్, కవాడిగూడ, అశోక్ నగర్, దోమలగూడ, ఇందిరా పార్క్, లోయర్ ట్యాంక్ బండ్, ముషీరాబాద్, చిక్కడపల్లిలో భారీ వర్షం పడుతోంది. అశోక్ నగర్ చౌరస్తా స్టీల్ బ్రిడ్జ్ పిల్లర్ నెంబర్ 17 వద్ద రెండు విద్యుత్ స్తంభాలు, ఓ భారీ వృక్షం నేలకొరిగింది. పరిసర ప్రాంతాల్లో ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. సంఘటన స్థలాన్ని చేరుకొని విద్యుత్ స్తంభాలు చెట్లను తొలగించి జీహెచ్ఎంసీ, డీఆర్ఎఫ్ సిబ్బంది సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భారీ వర్షం కురుస్తోండటంతో నగరంలో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జాం నెలకొంది. వర్షం ధాటికి చెట్ల కొమ్మలు, భారీ హోర్డింగులు కింద పడ్డాయి. భారీ వర్షం నేపథ్యంలో జీహెచ్ఎంసీ యంత్రాంగం అప్రమత్తమైంది. అత్యవసరమైతే 040-21111111,9000113667 టోల్ ఫ్రీ నెంబర్లలో సంప్రందించాలని కోరారు. హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది.

## మోడీ, అమిత్ షాపై రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు

**మొదటి పేజీ తరువాయి**

చేశారు. జూన్3న స్టాక్ మార్కెట్లు పెరుగుతాయని హోంమంత్రి చెప్పారని.. ఈ విషయం ఆయనకు ఎలా తెలుసని ప్రశ్నించారు. ఇది స్టాక్ మార్కెట్లో అత్యంత పెద్ద స్కామ్ అని చెప్పుకొచ్చారు. స్టాక్ మార్కెట్ల విషయంపై మొదటిసారిగా ప్రధాని మోడీ మాట్లాడారన్నారు. ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్ షా తమ విధులను దుర్వినియోగం చేశారని పేర్కొన్నారు. జూన్ 3 పెరిగిన స్టాక్ మార్కెట్లు.. జూన్ 4న పడిపోయాయన్నారు. ఎన్నికల అనంతరం మీడియా తప్పుడు ఎగ్జిట్ పోల్స్ ఇచ్చే విషయంలో మోడీ ప్రమేయం ఉందని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఫారెన్ ఇన్వెస్టర్లకు ఎగ్జిట్ పోల్స్‌కు ఏమైనా సంబంధం ఉందా ఎగ్జిట్ పోల్స్ చేసిన వారికి బీజేపీతో సంబంధం ఉందా స్కాక్ మార్కెట్ల పడిపోవడంతో ఇన్వెస్టర్లు 30 లక్షల కోట్లు నష్టపోయారన్నారు. బీజేపీ ఇంటర్నల్ సర్వేలో 220 సీట్లు వస్తాయని ముందే వారికి తెలుసన్నారు. ఎన్నికల తరువాత షేర్లు పెరుగుతాయని ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్ షా పదే పదే ఎందుకు చెప్పాల్సి వచ్చిందని ప్రశ్నించారు. బీజేపీ అగ్రనేతలు స్టాక్ మార్కెట్‌లో అవకతవకలకు పాల్పడుతున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు. పార్లమెంటరీ విచారణ చేయాలని కోరారు. ఎన్నికల ఫలితాల ప్రకటనకు కొద్ది రోజుల ముందు స్టాక్ మార్కెట్ గురించి బీజేపీ నేతలు ఎందుకు వ్యాఖ్యలు చేశారని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్టాక్ మార్కెట్‌పై వ్యాఖ్యానించడాన్ని తొలిసారిగా గుర్తించినట్లు రాహుల్ గాంధీ అన్నారు.

## 2రోజుల్లో విడుదలకానున్న టీచర్ల బదిలీ పదోన్నతుల షెడ్యూల్

**మొదటి పేజీ తరువాయి**

పేర్కొన్నారు. ఈ పదోన్నతుల ద్వారా దాదాపుగా 5,563 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు లభించనున్నాయన్నారు. ఇక 11,062 ఉపాధ్యాయ పోస్టులు డీఎస్సీ ద్వారా అదనంగా 11,062 ఉపాధ్యాయ పోస్టులు అందుబాటులోకి వస్తున్నాయని వెల్లడించారు. ఇక గతంలో అన్నింటినీ కలిపి హేతుబద్ధీకరణ చేపడతామని తద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత కూడా లేకుండా చేస్తామని బుర్రా వెంకటేశం తెలిపిన విషయం తెలిసిందే. అలాగే ప్రైవేటు పాఠశాలల్లో రుసుములు నియంత్రణకు మూడు, నాలుగు నెలల్లో కొత్త చట్టం తెచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని వెల్లడించారు.

## రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన బడిబాట

హైదరాబాద్, జూన్ 06 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా గురువారం నుంచి బడిబాట ప్రారంభమైంది. జూన్ 19వరకు కొనసాగనున్న బడిబాటలో భాగంగా ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్యను పెంచడమే సర్కార్ లక్ష్యంగా పెట్టుకుంది. ప్రభుత్వ స్కూళ్లలో చదివితే వచ్చే విద్యా, అవకాశాలపై తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు వివరించనున్నారు. బడిబాట ప్రోగ్రాంలో భాగంగా జూన్ 12న సీఎం రేవంత్ రెడ్డి స్కూళ్లను పున:ప్రారంభించనున్నారు. పాఠశాలల రీ ఓపెన్ సందర్భంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించనున్నారు సీఎం, మంత్రులు. రాష్ట్రవ్యాప్తంగా 26వేల ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు 19లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు.

## ఉద్యోగుల నుంచి ఫిర్యాదుల స్వీకరణ కోసం వెబ్ పోర్టల్

హైదరాబాద్, జూన్ 06 (తీన్మార్ న్యూస్): ఉద్యోగుల నుంచి ఫిర్యాదుల స్వీకరణ కోసం తెలంగాణ ప్రభుత్వం వెబ్ పోర్టల్‌ను ఏర్పాటు చేసింది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక జీవో 317, 46 బాధితులకు న్యాయం చేస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. కేబినెట్ సబ్ కమిటీ సూచనల మేరకు వెబ్ పోర్టల్ ఏర్పాటు చేశారు. ఇక జీఓను రద్దు చేయాలంటూ కొంతమంది ఉద్యోగులు హైకోర్టును కూడా ఆశ్రయించిన విషయం తెలిసిందే. బీజేపీ, కాంగ్రెస్ తదితర ప్రతిపక్ష పార్టీలు కూడా ఈ జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశాయి. ఈ విషయంలో బీజేపీ ఎంపీ బండి సంజయ్ అరెస్ట్ అవ్వడం రాష్ట్ర పాలిటిక్స్‌లో సంచలనం రేపింది. తాజాగా పోర్టల్ ఏర్పాటు చేయడంతో ముందడుగు పడినట్లయింది.

## ఇండియా కూటమిపై తెలంగాణ మంత్రి సీతక్క ట్విట్టర్ ట్వీట్

**మొదటి పేజీ తరువాయి**

బాగుండాలంటే చెట్లు నాటాలని సూచించారు. గ్లోబల్ వార్మింగ్ ప్రభావాలను నివారించడానికి చర్యలు చేపట్టాలన్నారు. మొక్కలు నాటుతూ పర్యావరణంలో భాగస్వాములు కావాలని కోరారు. భవిష్యత్తు తరాలకు మంచి వాతావరణం అందించడం మన కర్తవ్యమని గుర్తుచేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు మొక్కలునాటి పాఠశాల వాతావరణంలో పచ్చదనాన్ని నెలకొల్పాలని సీతక్క విజ్ఞప్తి చేశారు.

# ఎవరిని వరించేనో ఆమాత్య యోగం

**మొదటి పేజీ తరువాయి**

సర్కారు మనుగడ ఏర్పడనుంది. కాగా ఇది ఇలా ఉంటే తెలంగాణ రాష్ట్రంలో మరో చర్చకు దారి తీస్తున్నది. రాష్ట్రానికి ఎన్ని మంత్రిపదవులు దక్కుతాయనేది రాజకీయంగా చర్చానియామశంగా మారింది. తెలంగాణ నుంచి ఎంపీలుగా గెలుపొందిన 8 మందికి 8 మంది కూడ మంత్రిపదవి రేసులో ఉన్నారు. కేంద్ర మంత్రి వర్గంలో పనిచేసిన, బీజేపీ స్టేట్ చీఫ్ కిషన్ రెడ్డి సికింద్రాబాద్ నుంచి ఎంపీగా గెలుపొందిన విషయం తెలిసిందే. పార్టీ విజయానికి కృషి చేయడంలో కీలక పాత్ర పోషించడం, అపారమైన రాజకీయ అనుభవం, మంత్రిగా పనిచేసిన ఎక్స్ పీరియన్స్ కోటాలో ఆయన మంత్రిపదవిని ఆశిస్తున్నారు. మహబూబ్ నగర్ నుంచి ఎంపీగా గెలుపొందిన బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ మహిళా, సీనియారిటీ కోటాలో కేబినెట్ రేసులో ఉన్నారు. సీఎం సొంత జిల్లాలో కాంగ్రెస్ ను ఓడించగలిగానని ఆమె క్లెయిమ్ చేసుకుంటున్నారు. అయితే ఏపీ నుంచి ఆ రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి 2,39,139 ఓట్ల మెజార్టీతో గెలిచారు. మహిళకు ఇవ్వాల్సి వస్తే పురంధేశ్వరీ, డీకే అరుణలో ఎవరో ఒకరికి దక్కుతుందనే చర్చ కూడా నడుస్తోంది. మల్కాజ్ గిరి నుంచి పోటీ చేసి 3,91,475 మెజార్టీ సాధించి ఈటల రాజేందర్ కూడా కేబినెట్ రేసులో ఉన్నారు. అపారమైన రాజకీయ అనుభవం ఉండడం, ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా, బీజేపీలో జాయినింగ్స్ కమిటీ కన్వీనర్ గా పనిచేశారు ఈటల రాజేందర్. ఆయన ఈ సారి కేంద్ర కేబినెట్ రేసులో ఉన్నారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ నుంచి రెండో సారి ఎంపీగా గెలిచిన బండి సంజయ్ కేంద్ర మంత్రి పదవి రేసులో ఉన్నారు.రాష్ట్రంలో బీజేపీకి జవసత్వాలు అందించడంతో పాటు తన వాగ్ధాటి, సంచలన కామెంట్లతో వార్తల్లో నిలుస్తున్న సంజయ్ కేంద్ర మంత్రిపదవిని



ఆశిస్తున్నారు. ఆర్ఎస్ఎస్ మూలాలు కలిగిన సంజయ్ సామాన్య కార్యకర్త నుంచి ఎంపీగా, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పదవి వరకు ఎదిగారు. నిజామాబాద్ నుంచి ఎంపీగా రెండోసారి గెలుపొందిన ధర్మపురి అర్వింద్ కూడా కేబినెట్ రేసులో ఉన్నారు. రాజకీయ అనుభవం ఉన్న ఫ్యామిలీ నుంచి రావడంతో.. రెండో సారి ఎంపీగా గెలుపొందడం తనకు కలిసి వస్తుందనే ధీమాలో అర్వింద్ ఉన్నారు. ఆదిలాబాద్ నుంచి గెలుపొందిన గోడెం నగేశ్ కూడా ఎస్టీ కోటాలో కేంద్ర మంత్రి పదవిని ఆశిస్తున్నారు. 30 ఏండ్ల రాజకీయ అనుభవం ఉన్న నగేశ్ ఎన్టీఆర్ మంత్రి వర్గంలో రాష్ట్ర మంత్రిగా సేవలందించారు. సామాజిక వర్గ కూర్పు, అపారమైన రాజకీయ అనుభవం తనకు కలిసి వస్తుందని ఆయన భావిస్తున్నారు. చేవెళ్ల ఎంపీగా గెలుపొందిన కొండా విశ్వేశ్వర్ రెడ్డి కూడా కేంద్ర కేబినెట్ రేసులో ఉన్నారు.2014 లో బీఆర్ఎస్ తరఫున కొండా విశ్వశ్వర్ రెడ్డి ఎంపీగా గెలిచారు. రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన కొండా విశ్వేశ్వర్ రెడ్డికి 2019లో టికెట్ దక్కలేదు. దీంతో ఆయన బీజేపీలో చేరారు. రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం కావడం, తెలంగాణ ఉద్యమంలో పనిచేయడం, ఎంపీగా పనిచేసిన అనుభవం తనకు కలిసి వస్తాయని కొండా భావిస్తున్నారు. మెదక్ నుంచి విజయం సాధించిన రఘునందన్ రావు కూడా కేంద్ర కేబినెట్ బెర్త్ పై ఆశలు పెట్టుకున్నారు. తెలంగాణ ఉద్యమం ద్వారా రాజకీయాల్లోకి వచ్చిన రఘునందన్ రావు.. దుబ్బాక ఉప ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజయం సాధించారు. రఘునందన్ రావుకు హైకోర్టు న్యాయవాదిగా, వాగ్ధాటి ఉన్నరాజకీయ నాయకుడిగా పేరుంది. ఇవన్నీ తనకు కలిసి వస్తాయని భావిస్తున్న రఘునందన్ రావు కేంద్ర మంత్రి వర్గంలో చోటుపై ఆశలు పెట్టుకున్నారు.ఎన్డీఏ సర్కారుకు అరకొర మెజార్టీ రావడం వల్ల కచ్చితంగా మిత్రపక్షాల మీద ఆధారపడాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో మిత్రపక్షాలకు వీలైనన్ని ఎక్కువ మంత్రిపదవులు ఇవ్వాల్సి వస్తుంది. ఏపీలో గెలిచిన టీడీపీ, జనసేన, నీతీశ్ నేతృత్వంలోని జేడీయూ తదితర పార్టీలు మంత్రి పదవులను ఆశించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో తెలంగాణకు ఎన్ని మంత్రిపదవులు వస్తాయన్నది చర్చనీయాంశంగా మారింది. ఈ పరిణామాల నేపథ్యంలో కేంద్ర మంత్రిగా అనుభవం ఉన్న కిషన్ రెడ్డికి మాత్రమే అవకాశం ఇచ్చి చేతులు దులుపుకొంటారా ఆయనతో పాటు ఇంకా ఎవరికైనా ఇస్తారా అనేది హాట్ టాపిక్ గా మారింది.

# అన్న చిరంజీవి కాళ్ళ మీద పడిపోయిన పవన్ కళ్యాణ్

### మెగాస్టార్ ఆశీర్వాదం తీసుకున్న తమ్ముడు పవర్ స్టార్

### ఈ దృశ్యంతో కళ్ళు నీళ్లు తెచ్చుకున్న అన్న నాగబాబు



తీన్మార్ వెబ్ డెస్క్, జూన్ 06 (తీన్మార్ న్యూస్): ప్రజారాజ్యం పార్టీలో యువరాజ్యం బాధ్యతలు చేపట్టి ఆ తర్వాత రాజకీయంగా సైలెంట్ అయిన పవన్ కళ్యాణ్ జనసేన పార్టీతో మరోసారి ప్రజల ముందుకు వచ్చారు. 2014లోనే పార్టీ స్థాపించినా, అప్పుడు పోటీ చేయకుండా తెలుగుదేశం బిజెపి కూటమికి మద్దతుగా నిలిచారు. 2019లో వారిద్దరిని కాదని ఒంటరిగా పోటీ చేసి కేవలం ఒకే సీటుకి పరిమితమయ్యారు. ఇక 2024లో కూటమి ఏర్పాటు చేయడానికి ముఖ్య కారణంగా నిలిచిన పవన్ కళ్యాణ్ తనతో పాటు జనసేనకు 20 మంది ఎమ్మెల్యేలను ఇద్దరు ఎంపీలను గెలిపించుకున్నారు. దీంతో ఎన్డీఏలో ఆయనకు కూడా మంచి ప్రాధాన్యత లభిస్తుంది. రిజల్ట్ వచ్చినప్పటి నుంచి హైదరాబాద్ ఢిల్లీ షటిల్ సర్వీస్ చేస్తూ బిజీ బిజీగా గడుపుతున్న ఆయన గురువారం మెగాస్టార్ చిరంజీవి నివాసానికి వెళ్లారు. అక్కడ మెగాస్టార్ చిరంజీవి సహా ఇతర కుటుంబ సభ్యులందరితో సమయం వెచ్చించారు. ఈ సందర్భంగా మెగాస్టార్ చిరంజీవిని కలవగానే ముందుగా పవన్ కళ్యాణ్ వెళ్లి ఆయన కాళ్ళ మీద పడిపోయి ఆశీర్వాదం తీసుకున్నారు. ఆ తర్వాత ఈ దృశ్యాన్ని చూసి నాగబాబు కళ్ళు చమర్చగా కళ్ళు తుడుచుకున్నారు. ఇక ఆ తర్వాత చిరంజీవి గులాబీ గజమాలతో పవన్ కళ్యాణ్ ను సత్కరించారు. కుటుంబ సభ్యులందరూ ఏర్పాటుచేసిన కేక్ కటింగ్ కార్యక్రమంలో కూడా పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రామ్ చరణ్, రామ్ చరణ్ భార్య ఉపాసన అలాగే మెగాస్టార్ చిరంజీవి కుమార్తెలు మనవరాళ్ళు, మనవళ్లు, వరుణ్ తేజ్ ఆయన భార్య లావణ్య నిహారిక సహా అందరూ పాల్గొన్నారు. ఆసక్తికరమైన అంశం ఏమిటంటే పవన్ వెంట తన భార్య అన్నా లెజినోవాతో పాటు కుమారుడు అఖీరా నందన్ కూడా ఉన్నారు. ఇక ఈ వీడియో రిలీజ్ చేసిన వెంటనే సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. మెగాస్టార్ చిరంజీవి కళ్ళల్లో ఆనందం చాన్నాళ్ల తర్వాత కనిపించిందని కామెంట్స్ వినిపిస్తున్నాయి.

## కౌర్ కంగనా రనౌత్‌ని చెంపదెబ్బ కొట్టిన సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్

### రైతులను అగౌరపరిచారని ఆరోపిస్తూ కంగనాపై కానిస్టేబుల్ దాడి

### కంగనాపై కానిస్టేబుల్ దాడికి పాల్పడినట్లు సమాచారం



తీన్మార్ వెబ్ డేస్క్, జూన్ 06 (తీన్మార్ న్యూస్): బీజేపీ ఎంపీ, బాలీవుడ్ నటి కంగనా రనౌత్‌కి చండీగఢ్ ఎయిర్‌పోర్టులో చేదు అనుభవం ఎదురైంది. ఎయిర్‌పోర్టులో సీఐఎస్ఎఫ్ సిబ్బంది కుల్వీందర్ కౌర్ కంగనా రనౌత్‌ని చెంపదెబ్బ కొట్టారు. రైతులను అగౌరపరిచారని ఆరోపిస్తూ కంగనాపై సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలోని మండి లోక్‌సభ నియోజకవర్గం నుంచి బీజేపీ తరుపున గెలుపొందిన కంగనా ఢిల్లీకి వెళ్తే సమయంలో ఈ ఘటన జరిగింది. కంగనా చెప్పిన వివరాల ప్రకారం.. ఆమె UK707 విమానంలో ఢిల్లీకి వెళ్లేందుకు విమానాశ్రయంలోని బోర్డింగ్ పాయింట్‌కి వెళుతుండగా,ఆమెతో కుల్వీందర్ కౌర్ వాగ్వాదానికి దిగి తనను కొట్టారని ఆరోపించారు. ఢిల్లీకి చేరుకున్న కంగనా సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ నీనా సింగ్‌తో పాటు ఇతర సీనియర్ అధికారులకు జరిగిన సంఘటన వివరించారు. కానిస్టేబుల్, కుల్వీందర్‌ను అదుపులోకి తీసుకుని, విచారణ కోసం CISF కమాండెంట్ కార్యాలయానికి తరలించారు.

కంగనా రనౌత్ ఇటీవల బీజేపీ పార్టీ టికెట్‌పై మండి నుంచి పోటీ చేసి గెలుపొందారు. హిమాచల్ ప్రదేశ్ మాజీ సీఎం వీరభద్ర సింగ్ కొడుకు, కాంగ్రెస్ నేత విక్రమాదిత్య సింగ్‌ని ఓడించారు. ఎన్నికల్లో గెలిచిన రెండు రోజులకే ఆమెకు ఈ చేదు అనుభవం ఎదురైంది. గతంలో రైతుల ఉద్యమాన్ని వ్యతిరేకిస్తూ కంగనా పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. వ్యాఖ్యల కారణంగానే ఆమె దాడి జరిగినట్లు తెలుస్తోంది.

## ఈ నెల 8నుంచి హైదరాబాద్‌లో చేప ప్రసాదం పంపిణీ

**మొదటి పేజీ తరువాయి**

వివిధ రాష్ట్రాల నుంచి ప్రజలు వస్తుంటారు. ఈ క్రమంలోనే చేప మందుకు వచ్చే వారి కోసం టీజీఎస్ ఆర్టీసీ శుభవార్త చెప్పింది. జూన్ 8, 9వ తేదీల్లో హైదరాబాద్ నాంపల్లి గ్రౌండ్స్‌లో చేప మందు పంపిణీ చేయనున్నారు. తేదీల్లో 130 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ఆర్టీసీ ప్రకటించింది. ప్రధాన రైల్వే స్టేషన్లు సికింద్రాబాద్, కాచిగూడ రైల్వే స్టేషన్లు, ప్రధాన బస్టాండ్లు అయిన జేబీఎస్, ఎంజీబీఎస్ నుంచి, శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌కు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు తెలిపింది. వీటితో పాటు దిల్‌సుఖ్‌నగర్, ఎన్జీవోస్ కాలనీ, మిధాని, ఉప్పల్, చార్మినార్, గోల్కొండ, రాంనగర్, రాజేంద్రనగర్, రిసాల్ బజార్, ఈసీఐఎల్ క్రాస్ రోడ్స్, పటాన్‌చెరు, జీడిమెట్ల, కేపీహెచ్‌బీ కాలనీ, గచ్చిబౌలి ప్రాంతాల నుంచి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌కు మొత్తం 80 బస్సులు ఏర్పాటు చేశారు. ఈ విషయంలో ఏమైనా సందేహాలు ఉంటే ప్రయాణికులకు దగ్గరలోని బస్‌స్టాండులో కనుక్కోవాలని సూచించింది.

## లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన వారిలో మెజారిటీ సభ్యులు కొత్తవారే

**మొదటి పేజీ తరువాయి**

సినీనటులు కంగనా, సురేశ్ గోపి ఉన్నారు. తెలుగు రాష్ట్రాల్లో తెలంగాణ నుంచి 10, ఏపీ నుంచి 13 మంది కొత్తవారున్నారు. రాజ కుటుంబాలకు చెందిన ఛత్రపతి సాహు, యదువీర్ కృష్ణదత్త చామరాజ వడియార్, కృతీ దేవితోపాటు కోల్‌కతా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అభిజిత్ గంగోపాధ్యాయ తొలిసారిగా లోక్‌సభలో అడుగుపెడుతున్నారు. తొలిసారిగా లోక్‌సభకు వస్తున్న సినీ నటుల్లో సురేశ్ గోపీ, కంగనా రనౌత్ ఉన్నారు. రాజ్యసభ సభ్యుల్లో అనిల్‌దేశాయ్, భూపేంద్ర యాదవ్, ధర్మేంద్రప్రధాన్, మాండవీయ, పురుషోత్తం రూపాలా లోక్‌సభకు వస్తున్నారు.

## తెలంగాణ ప్రజలు బీజేపీని కోరుకుంటున్నారు

**మొదటి పేజీ తరువాయి**

బీజేపీ గెలుచుకున్నాం తెలంగాణలో భవిష్యత్తు అంతా బీజేపీదే అని కిషన్ రెడ్డి అన్నారు. దేశ ప్రజలు మరోసారి మోదీకి జైకొట్టారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. అదేవిధంగా తెలంగాణ ప్రజలు బీజేపీనికి కోరుకుంటున్నారని చెప్పారు. ప్రతి ఎన్నికల్లో బీజేపీకి ఓటింగ్ శాతం పెరుగుతోంది. బీజేపీకి 35 శాతానికి పైగా ఓట్లు వేశారని చెప్పారు. లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందన్నార కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి.. బీజేపీ గెలిస్తే బడుగు బలహీన వర్గాలను అన్యాయం జరుగుతుందని అబద్ధపు ప్రచారం కాంగ్రెస్ చేసిందన్నారు. అయినా దేశ ప్రజలు మరోసారి అధికారం ఇచ్చారన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బీజేపీ పనిచేస్తుందన్నారు కిషన్ రెడ్డి.

## చంద్రబాబుకి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు

**మొదటి పేజీ తరువాయి**

ఫోన్ చేసిన రేవంత్ ఏపీ సీఎంగా బాధ్యతలు చేపట్టనున్న సందర్భంగా హృదయపూర్వక అభినందనలు తెలిపారు. రెండు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు కొనసాగాలని విభజన చట్టానికి సంబంధించిన పెండింగ్ అంశాల పరిష్కారానికి సహృదయంతో సహకరించాలని కోరారు. మహబూబాబాద్ ఎంపీ ఫలితాలపై సీఎం రేవంత్ సమీక్ష నిర్వహించారు. జూన్ 9న ఏపీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న చంద్రబాబుకు సీఎం రేవంత్ రెడ్డి ఫోన్ చేశారు. కార్యక్రమంలో మంత్రులు సీతక్క, ఎంపీ బలరాంనాయక్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## నేటి నుంచి పునఃప్రారంభంకానున్న ప్రజావాణి

**మొదటి పేజీ తరువాయి**

కానున్నట్లు ప్రజావాణి ఇంచార్జీ, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ చిన్నారెడ్డి తెలిపారు. దేశ వ్యాప్తంగా లోక్ సభ ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉన్నందు వల్ల ప్రజావాణి అర్జీల కార్యక్రమం తాత్కాలికంగా వాయిదా పడిందని చిన్నారెడ్డి పేర్కొన్నారు. లోక్ సభ ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో ప్రజావాణి అర్జీల స్వీకరణ కార్యక్రమం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో ప్రతి వారం మంగళ, శుక్ర వారాల్లో కొనసాగుతుందని చిన్నారెడ్డి వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ప్రజలు తమ సమస్యలను అర్జీల ద్వారా ప్రజావాణిలో అందజేయాలని చిన్నారెడ్డి కోరారు. ప్రజావాణి స్టేట్ నోడల్ ఆఫీసర్ గా రాష్ట్ర మున్సిపల్ డైరెక్టర్ దివ్య వ్యవహరిస్తున్నారు.

తీన్మార్
తెలుగు దినపత్రిక

## అన్ని పార్టీలకు పాఠం నేర్పిన ఓటర్

సార్వత్రిక ఎన్నికలు ప్రజాస్వామిక వ్యవస్థలో ఒక గుణాత్మకమైన మార్పుగా చెప్పవచ్చు. రాజకీయాల్లో గెలుపు ఓటములు సర్వసాధారణమే అయినప్పటికీ ప్రజాస్వామ్యం, మానవ హక్కులు రక్షించడానికి నేడు రాజకీయ వ్యవస్థలో నెలకొన్న పరిస్థితులను గమనిస్తే విలువలతో కూడిన దాఖలాలు మనకు కనిపించడం లేదు. 75 సంవత్సరాల స్వతంత్ర భారతంలో మొదటి, రెండు తరాల్లో రాజకీయాలలో విలువలు, ప్రజాస్వామ్యం పట్ల నమ్మకంతో కూడుకున్న రాజకీయాలు కొనసాగాయి. కానీ, 2014 నుంచి నిరంకుశ, నిర్బంధ రాజకీయ వ్యవస్థను కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా మానవ హక్కులకు తీవ్రమైన భంగం కలిగింది. ఇటువంటి రాజకీయ వ్యవస్థకు బుద్ధి వచ్చేలా 2024 సార్వత్రిక ఎన్నికలలో ప్రజలు భిన్నమైన తీర్పును ఇచ్చారు. 18వ లోక్‌సభ ఎన్నికలు ఏప్రిల్ 19న మొదలై జూన్ 2 వరకు 7 విడతలుగా జరిగాయి. ఉత్తర భారతదేశంతో పాటు దక్షిణ భారత్‌లో కూడా భారతీయ జనతా పార్టీ తన ఆధిపత్యాన్ని కొనసాగించాలని చూసింది. కానీ, ఆంధ్రా, కర్ణాటక మినహా మిగిలిన చోట్ల అంతగా ప్రభావం చూపలేదు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో నవంబర్ 30న జరిగిన శాసనసభ ఎన్నికలలో పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఓడించి కాంగ్రెస్ అధికారాన్ని చేపట్టింది. అయితే, 2018లో ఒక్క సీటు మాత్రమే గెలుచుకున్న బీజేపీ అప్పుడు 8 గెలుచుకొని తన సత్తాను చాటుకున్నది. అదే హవాను పార్లమెంట్ ఎన్నికల్లో కొనసాగించి 8 సీట్లను సాధించింది. దీన్నిబట్టి చూస్తే బీజేపీ తెలంగాణ రాష్ట్రంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిందని అర్థమౌతోంది. కేంద్ర నాయకత్వం ముఖ్యంగా ప్రధానమంత్రి స్థాయి గల వ్యక్తి 20 సార్లు బహిరంగ సభలు పెట్టారు. అసెంబ్లీ ఎన్నికలలో గెలిచిన ఊపుతో కాంగ్రెస్ పార్టీ కూడా తన ప్రచారాన్ని ముమ్మరం చేసి 8 సీట్లు సాధించగలిగింది. ఎంఐఎం ఒక్క సీటు దక్కించుకుంది. ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికల విషయాన్ని పరిశీలిస్తే యావత్ భారతదేశాన్ని ఆకర్షించిన ఎన్నికలుగా, ఫలితాలుగా చెప్పుకోవచ్చు. ఇప్పటివరకు అధికారంలో ఉన్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గడిచిన ఐదు సంవత్సరాలలో సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టి, ముఖ్యంగా విద్య, వైద్య రంగాలను అభివృద్ధిలోకి తీసుకువచ్చినప్పటికీ అక్కడి ప్రజలు వినూత్న రీతిలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి పట్టం కట్టారు. దీనికి కారణాలు అనేకం. గ్రామస్థాయి నుండి పట్టణ స్థాయి వరకు పరిపాలనా వ్యవహారాలు సమర్థనీయంగా ఉన్నప్పటికీ, రాజధాని మార్చడం పెద్ద పొరపాటుగా చెబుతున్నారు. భారతీయ జనతా పార్టీ వచ్చే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఉత్తరప్రదేశ్‌లో రామ జన్మభూమి స్థానంలో తిరిగి రాముని విగ్రహాన్ని ప్రతిష్టించింది. భారతదేశ వ్యాప్తంగా రామనామం జపం చేయడం జరిగింది. 2014 నుండి 2024 వరకు పది సంవత్సరాల పరిపాలన కాలంలో భారతీయ జనతా పార్టీ తన అధికార రాజకీయ సుస్థిరతను నెలకొల్పుకోవడానికి చేపట్టిన చర్యల్లో ముఖ్యంగా ఆర్టికల్ 360 రద్దు, జమ్మూ కాశ్మీర్ ప్రత్యేకతను రద్దు చేయడం, త్రిపుల్ తలాక్, వంటి మేజర్ కార్యక్రమాలను చేపట్టింది. అయితే, భారతదేశ అంతర్జాతీయ సంబంధాలలో గతంలో ఎన్నడు లేని విధంగా మోదీ దాదాపు అగ్ర రాజ్యాలతో నెలకొల్పిన దౌత్య సంబంధాలు ప్రపంచ దేశాలను ఆకర్షించాయి. అయితే, ఇక్కడ గమనించదగ్గ విషయం ఏంటంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో జరిగిన కుంభకోణాలను తీవ్రంగా ప్రచారం చేయడంలో బీజేపీ సఫలమైంది. భారతదేశంలో ఆర్థిక సుస్థిర సరళీకరణ విధానాన్ని ప్రవేశపెట్టింది కాంగ్రెస్ పార్టీ అయినప్పటికీ, ఆర్థిక వ్యవస్థను బీజేపీ బలోపేతం చేసినట్లు ప్రచారం చేసుకోవడంలో సఫలీకృతమైనట్లు చెప్పవచ్చు. అధికంగా అభివృద్ధి చెందిన దేశాలలో భారతదేశం కూడా ఐదో స్థానంలో ఉందని ప్రసారం చేయడంలో ఎన్డీఏ కూటమి సఫలం అయింది. అలాగే, కాంగ్రెస్ కూటమిలో సమర్థవంతమైన నాయకత్వం లేదని ప్రచారం చేసింది. ఎన్నికల ప్రచారంలో సబ్ కా వికాస్ అనే నినాదంతో ముందుకు వచ్చింది. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ తరపున రాహుల్ గాంధీ కాశ్మీర్ టు కన్యాకుమారి వరకు చేపట్టిన పాదయాత్ర మంచి ఫలితాన్ని ఇచ్చింది. ఎందుకంటే ప్రస్తుతం ఆ పార్టీ గెలుచుకున్న స్థానాలను బట్టి చూస్తే రాహుల్ గాంధీ చేపట్టిన యాత్ర దేశ్ కీ బచావో అన్న నినాదంతో కూటమి ప్రచారం చేసుకోవడం జరిగింది. అయితే, ఇక్కడ గమనించదగ్గ విషయం ఏంటంటే భారతదేశం అంటే 80 శాతం ఉన్న హిందూవుల దేశంగా ప్రచారం చేయడంలో బీజేపీ విజయం సాధించింది. కాంగ్రెస్ పార్టీ సర్వమత సమ్మేళనం అన్నట్లుగా తన ప్రచార కార్యక్రమాన్ని(సెక్యులర్) నినాదంతో ముందుకు సాగింది. ఏది ఏమైనా భారతదేశంలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికలు, గెలుపు ఓటములతో ప్రజలకు పెద్దగా ఒరిగేది ఏమీ ఉండదు. గడిచిన 75 సంవత్సరాలుగా దేశంలో ఏ విధమైన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ఉన్నాయో ప్రస్తుతం ఆధునిక శాస్త్ర సాంకేతిక కాలంలో కూడా అదేవిధంగానే కొనసాగుతోంది. ముఖ్యంగా రాజకీయాలలో కుట్రలు, కుతంత్రాలే. అయితే, ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసిన వాడు చరిత్ర హీనుడు కాక తప్పదు. కాబట్టి 18వ లోక్ సభ సార్వత్రిక ఎన్నికల ఫలితాలు దేశ ప్రజా జీవన వ్యవస్థలో తీవ్రమైన మార్పులు తీసుకువస్తాయన్న నమ్మకం లేదు. ఎప్పటి లాగానే సూర్యుడు తూర్పునే ఉదయిస్తాడు, పడమరలో అస్తమిస్తాడు. సామాజిక వ్యవస్థలలో ఎన్నికలు వస్తూనే ఉంటాయి పోతూనే ఉంటాయి. భూమిని నమ్ముకున్న రైతుకు పొద్దున్నే లేచి మట్టిలో పనిచేయాల్సిందే. కష్టాన్ని నమ్ముకున్న కూలీ పనికి వెళ్లాల్సిందే. ఏది ఏమైనా ప్రజాస్వామ్య వ్యవస్థలో ఏ పార్టీ గెలిచినా, ఏ రాజకీయ నాయకుడు అధికారంలోనికి వచ్చినా ప్రజా జీవితంలో పెద్ద మార్పు ఉండదని చెప్పాలి. అయితే, ఈసారి ఇచ్చిన తీర్పు దేశంలో మేధావి వర్గాన్ని ఆలోచింపజేసేలా ఉంది.

# పంటకు సమృద్ధిగా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలి

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి
- నకిలీ విత్తనాల విక్రయంపై కఠిన చర్యలు
- లైసెన్సుడ్ డీలర్ల నుంచి రశీదు పొంది విత్తనాలను కొనుగోలు చేయాలి
- త్రాగు నీటి సరఫరా ఇబ్బందులు రాకుండా అప్రమత్తంగా ఉండాలి
- మిషన్ భగీరథ స్థితిగతులపై నివేదిక రూపొందించాలి
- జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్



ములుగు, జూన్ 06 (తీన్మార్ న్యూస్): వానాకాలం పంటకు సమృద్ధిగా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్, ఇతర రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణ, వానాకాలం పంట సీజన్ విత్తనాలు, ఎరువుల లభ్యత, మిషన్ భగీరథ, త్రాగు నీటి సరఫరాపై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి మాట్లాడుతూ, వానాకాలం పంట సీజన్ ప్రారంభమవు తుందని, రైతులకు అవసరమైన అన్ని రకాల విత్తనాలు, ఎరువుల స్టాక్ మన రాష్ట్రంలో ప్రతి జిల్లాలో సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని, వాటి పంపిణీ లో ఎక్కడా ఇబ్బందులు రాకుండా పట్టిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ లకు సీఎస్ సూచించారు. రాబోయే 20 నుంచి 25 రోజుల వ్యవధిలో చాలా వరకు రైతులు విత్తనాలను కొనుగోలు చేస్తారని, ఈ సమయంలో క్షేత్రస్థాయిలో సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ నకిలీ విత్తనాలను అరికట్టాలని అన్నారు. వ్యవసాయ, పోలీస్ శాఖ అధికారులు సమన్వయంతో పని చేస్తూ నకిలి విత్తనాలు ఎక్కడా విక్రయించకుండా చూడాలని, నకిలి విత్తనాలు విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. రైతులు ప్రభుత్వం గుర్తించిన లైసెన్స్ విత్తన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలని, విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రైతులు తప్పనిసరిగా బిల్లు రశీదు తీసుకోవాలని, సీల్డ్ ప్యాకెట్లను మాత్రమే రైతులు కొనుగోలు చేయాలని విస్తృతంగా ప్రచారం చేయాలని సీఎస్ సూచించారు. రైతులకు అవసరమైన విత్తనాలపై రిజిస్టర్ నిర్వహించాలని అన్నారు. వానా కాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులకు అవసరమయ్యే పచ్చి రొట్టె విత్తనాలు సైతం అందుబాటులో ఉంచాలని, వరి సన్న రకాల విత్తనాల స్టాక్ లు ఉంచాలని తెలిపారు. పత్తి విత్తనాలను రైతులకు అవసరమైన మేర అందుబాటులో ఉంచాలని, రైతులకు అవసరమైన రకాల విత్తనాలు అందుబాటులో లేని పక్షంలో త్వరితగతిన సదరు విత్తనాల స్టాక్ మార్కెట్ లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, మంచి విత్తనాలు రైతులు వినియోగించాలని అన్నారు. జిల్లాలో ముందుగా ఎక్కడ వ్యవసాయం ప్రారంభమవుతుందో, ఎక్కడ నాట్లు వేస్తారో ఆ ప్రాంతాలలో ఎరువులు, విత్తనాలు అవసరమైన మేర అందుబాటులో ఉంచాలని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని అన్నారు. నకిలీ విత్తనాల గురించి సమాచారం అందితే వెంటనే మీడియా ద్వారా రైతులను అప్రమత్తం చేయాలని, నకిలీ విత్తనాలను విక్రయిస్తున్న వారిపై పి.డి. యాక్ట్ క్రింద కేసులను నమోదు చేయాలని, సదరు సమాచారాన్ని సైతం మీడియాకు ఎప్పటికప్పుడు అందించాలని సీఎస్ సూచించారు. వానాకాలం సాగులో రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు నిపుణుల ద్వారా అందించేందుకు రైతు నేస్తం కార్యక్రమం క్రింద రైతు వేదికల వద్ద ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ సిస్టం పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సి.ఎస్ అధికారులకు సూచించారు. వేసవికాలంలో ఎటువంటి ఇబ్బంది లేకుండా త్రాగునీటిని విజయవం తంగా సరఫరా చేయడంలో అధికారులు సఫలీకృతు లయ్యారని, ఇదే స్ఫూర్తితో రాబోయే 20 రోజులలో సైతం అప్రమత్తంగా ఉంటూ ప్రతి ఇంటికి త్రాగునీరు సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. త్రాగునీటి సరఫరాను జిల్లా స్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని, ప్రతి ఇంటికి సరిపడా త్రాగునీరు సకాలంలో సరఫరా అయ్యేందుకు అవసరమైన చర్యలు కట్టుదిట్టంగా తీసుకోవాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా మిషన్ భగీరథ త్రాగునీటి సరఫరాపై సర్వే నిర్వహించి నివేదికను సమర్పించాలని సిఎస్ సూచించారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి ఇంటినీ సందర్శించి మిషన్ భగీరథ త్రాగునీటి సరఫరా స్థితి గతులను పరిశీలించి నివేదిక సమర్పించాలని సీఎస్ పేర్కొన్నారు. సింగల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని ప్రభుత్వం నిషేధించిందని, దీనిని క్షేత్రస్థాయిలో కట్టుదిట్టంగా అమలు చేయాలని, సింగల్ యూజ్ ప్లాస్టిక్ ప్రత్యామ్నాయక బట్ట సంచుల వినియోగాన్ని ప్రోత్సహించాలని సిఎస్ పేర్కొన్నారు. పాఠశాలలు పునః ప్రారంభానికి ముందే ప్రతి విద్యార్థికి రెండు జతల స్కూలు యూనిఫామ్ కుట్టించి అందజేయాలని సీఎస్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి విజయ చంద్ర, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ కుమార్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీకి ఓటు వేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు

**మీడియా సమావేశంలో ఎంపీ అభ్యర్థి మారపల్లి సుధీర్ కుమార్**

హన్మకొండ, జూన్ 06 (తీన్మార్ న్యూస్): బాల సముద్రంలోని బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయం లో భారత రాష్ట్ర సమితి వరంగల్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మారపల్లి సుధీర్ కుమార్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మారపల్లి సుధీర్ కుమార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటమి గెలుపు అనేది సహజం అని,ప్రజల పక్షాన పోరాటం చేస్తామని అన్నారు. ప్రజల తీర్పును గౌరవిస్తామని, ప్రజల పట్ల నిబద్ధతతో ఉంటామని, కాంగ్రెస్ పార్టీ అమలు కానీ ఆరు గ్యారెంటీ ల పేరుతో ప్రజల్ని మోసం చేస్తుందని అన్నారు.ఆగస్టు 15 లోపు రెండు లక్షల రుణమాఫీని చేస్తామని చెప్పి రైతులను మోసం చేస్తూ, వారి ఓట్లను దండుకుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అనేక మోసపూరిత హామీలతోపాటు డబ్బులను కూడా పంపిణీ చేసి ఎన్నికల్లో గెలిచిందని అన్నారు. ప్రజల తీర్పును శిరసా వహిస్తానని, రానున్న రోజుల్లో తిరిగి బి ఆర్ ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందనే ధీమాను వ్యక్తం చేశారు. 64 మంది ఎమ్మెల్యేలతో గద్దెనెక్కినటువంటి కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు ఎన్నికల్లో 8 సీట్లకే పరిమితమైందని ఆరు నెలల్లోనే ఇంత వ్యతిరేకత వచ్చిందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సొంత ఇలాకాలో, ముఖ్యమంత్రి ఇంతకుముందు ఎంపీగా గెలుపొందిన మల్కాజిగిరిలో సైతం బిజెపి అభ్యర్థులు గెలిచారంటే సీఎం పాలన ఏ విధంగా ఉందో ప్రజలకు అర్థమైందన్నారు. 6 గ్యారంటీలో 13 అంశాల్లో ఐదు హామీలను నెరవేర్చకుండానే నెరవేర్చిందని ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తూ ఇంకా ప్రజలను మభ్యపెడుతూ అభివృద్ధి ఆక్షేపణ లేకుండా చేస్తున్నటువంటి ముఖ్యమంత్రి కి ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. మహబూబ్ నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బి ఆర్ ఎస్ పార్టీ విజయ డంకా మోగించిందని అన్నారు. ఇది కూడా సీఎం జిల్లా కావడం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీని సైతం ఓడిపోవడం జరిగిందని అన్నారు. ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి మంత్రులంతా కలిసి 15 ఎంపీలను గెలుస్తామని చెప్పినటువంటి వారు 8 సీట్లు గెలిచారని, వారి అంచనాలు తలకిందులు అయ్యాయని అన్నారు. బిజెపి పార్టీ కూడా దేశవ్యాప్తంగా అనుకున్న స్థానాలు గెలవలేక పోయిందని, బిజెపిపై ప్రజలు వ్యతిరేకతతో ఉన్నారని, అందుకే పార్లమెంట్ స్థానాలు భారీగా తగ్గాయని అన్నారు. ఎన్డిఎ కూటమిలోని పార్టీలతో జతకట్టి నరేంద్ర మోడీ ప్రధానమంత్రిగా మరొకసారి కాబోతున్నారే తప్ప, 400 సీట్లు గెలుస్తామన్న బిజెపి గతంలో గెలిచిన సీట్లు కూడా గెలవలేదని అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు జాతీయ పార్టీలను చూసి ఓటేసారని అన్నారు. అయినా కానీ వరంగల్ లోక్ సభ స్థానంలో సుమారు రెండు లక్షల 30 వేలు ఓట్లు బిఆర్ఎస్ పార్టీకి రావడానికి కృషి చేసినటువంటి కార్యకర్తలకు, నాయకులకు, ప్రజాప్రతినిధులకు, మాజీ ఎమ్మెల్యేలకు, మాజీ ఎమ్మెల్సీలకు ధన్యవాదాలు తెలిపారు. ఇకనైనా కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధిపై దృష్టి పెట్టాలని, చిహ్నాల మార్పుల పైన, తెలంగాణ తల్లి విగ్రహం మార్పు పైన దృష్టి పెట్టకుండా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కూడా చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజనీకాంత్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఉడతల సారంగపాణి, నార్ల గిరి రమేష్, నయీముద్దీన్, చింతం యాదగిరి, సయ్యద్ మసూద్, బండి రజనీ కుమార్,జోరిక రమేష్ పోలపల్లి రామ్మూర్తి, చంద్రమోహన్, సల్వాజి రవీందర్ రావు, రమేష్, కుసుమ లక్ష్మీనారాయణ, ఖలీల్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.



# డాక్టర్ మల్లురవి గెలుపుకు కృషి చేసిన ప్రజానీకానికి కృతజ్ఞతలు

**- తుడి శ్రీనివాస్ రెడ్డి మండల సమన్వయకర్త**

వనపర్తి ప్రతినిధి, జూన్ 06(తీన్మార్ న్యూస్): వనపర్తి నియోజకవర్గం లోని కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి డా.మల్లు రవి కి ఓటు వేసి గెలిపించిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, కాంగ్రెస్ పార్టీ అభిమానులకు, ఎమ్మెల్యే మేగారెడ్డి అభిమానులకు, మరియు డాక్టర్.మల్లురవి గెలుపుకు కష్టపడ్డ ప్రతి ఒక్కరికి పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తుడి శ్రీనివాస్ రెడ్డి పేరు పేరునా ధన్యవాదాలు తెలియజేశారు. ముఖ్యంగా డాక్టర్ మల్లు రవి గెలుపుకు అహర్నిశలు, కష్టపడి, ప్రతి ఒక్కరిని సమన్వయంగా కలుపుకుంటూ నాగర్ కర్నూల్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేయడంలో కీలక పాత్ర పోషించిన వనపర్తి ఎమ్మెల్యే తుడి మేగారెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాని పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తుడి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. డా.మల్లురవి కి 94.414 మెజారిటీ రావడం నిజంగా హర్షించదగ్గ విషయమని, డాక్టర్. మల్లు రవి గెలుపుకు, అహర్నిశలు పనిచేసిన వనపర్తి ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి కృషివల్లె, ఈరోజు నాగర్ కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్.మల్లురవి గెలుపు కు, ఎల్లవేళల కృషి చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ ఎన్నికలో ప్రజలు చూపిన అభిమానానికి, వచ్చేస్థానిక సంస్థల ఎన్నికల్లో, ఇంతకంటే భారీ మెజార్టీ తీసుకొస్తామని, ఆ దిశగా ప్రయత్నాలు ఇప్పటినుంచి మొదలు పెడతామని తుడి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ పార్లమెంట్ ఎలక్షన్లలో డా.మల్లురవి గారి గెలుపు కోసమై, కష్టపడ్డ ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని తుడి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.



నేను ఇదివరకె డా.మల్లు రవి ఒక లక్ష మెజార్టీతో గెలుపొందు కచ్చితంగా గెలుస్తారని చెప్పానని గుర్తు చేశారు. అదేవిధంగా వనపర్తి నియోజక వర్గంలో ఎమ్మెల్యే తుడి మేగ రెడ్డి కృషి వల్లే, ఎలక్షన్ కంటే డా.మల్లు రవి కోసం ఎలక్షన్లో విరామం లేకుండా, విశ్రాంతి లేకుండా కష్ట పడి, కాంగ్రెస్ కార్యకర్తలను ముందుకు నడిపించినటువంటి వనపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే తుడి మేగారెడ్డి కి ధన్యవాదాలు తెలియజేస్తు న్నానని హర్షం వ్యక్తం చేశారు. వనపర్తి నియోజకవర్గం లో పెద్దమందడి గ్రామంలో డాక్టర్.మల్లు రవి గెలుపు కొరకై కష్టపడ్డ ప్రతి ఒక్క కాంగ్రెస్ నాయకుని కి, కార్యకర్తలకు మరియు కాంగ్రెస్ అభిమానులకు శిరస్సు వంచి అభివాదం చేస్తున్నాను, పెద్దమందడి కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త అని తుడి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.

# విద్యార్థుల సంఖ్యను పెంచేందుకే బడిబాట



టేక్మాల్, జూన్ 06(తీన్మార్ న్యూస్): ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి ప్రభుత్వం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని జెడ్ పి హెచ్ ఎస్ హెచ్ఎం రాజేంద్రప్రసాద్ అన్నారు. గురువారం టేక్మాల్ మండల కేంద్రంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ కుమ్మరి భాలమని ఆద్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్ఎం రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తే నాణ్యమైన విద్యతో పాటు యూనిఫామ్స్ పుస్తకాలు ప్రభుత్వం అందజేస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఆధునిక పద్ధతుల ద్వారా అనుభవం ఉన్న ఉపాధ్యాయులతో విద్యాబోధన చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రైమరీ స్కూల్ హెచ్ఎం సుజాత ఉపాధ్యాయులు దుర్గమ్మ అమీరుద్దీన్ నరేందర్ ఫరీదా రాణి తదితరులు ఉన్నారు.

# విప్, ఎమ్మెల్యే బీర్లకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ర్యాకల శ్రీనివాస్

యాదగిరిగుట్ట టౌన్, జూన్ 06(తీన్మార్ న్యూస్): ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య జన్మదిన సందర్భంగా యాదగిరిగుట్ట పట్టణంలో గురువారం రోజున వారిని, శాలువాతో సత్కరించి నోటు పుస్తకాలు అందజేసి కురుమ యువ చైతన్య సమితి యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి ర్యాకల శ్రీనివాస్ జన్మ దిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు.



# ఒట్టు లిక్కర్ పంచలేదు

కరీంనగర్: 1962 తర్వాత దేశంలో ఏ పార్టీ కూడా మూడవ సారీ అధికారంలో రాలేదని, కేవలం బీజేపీ మాత్రమే అధికారంలో వచ్చిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ అన్నారు. వేములవాడ లో వారు మీడియా తో మాట్లాడారు బండి సంజయ్ కి ఉద్యమ సమయాల్లో రాని మెజార్టీ ఇప్పుడు వచ్చింది అన్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోఎక్కడ లిక్కర్ పంచలేదని, కేవలం నరేంద్ర మోడీ చరిష్మా తో గెలిచిందిన్నారు. అనాడు విద్యాసాగర్ రావు కల్లోలిత సమయంలో కూడాఎంపీగా గెలిచారన్నారు. నరేంద్రమోడీ వేములవాడ ర్యటన చాలా సక్సెస్ అయింది..దాని ఎఫెక్ట్ చాలా పడిందన్నారు. ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ ఎంఎల్ఏలు కేవలం సానుభూతితో మాత్రమే గెలిచారన్నారు.

# ఘనంగా పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం



మోటకొండూరు, జూన్ 06(తీన్మార్ న్యూస్): ఎరా ఒరేయ్ అంటూ పలకరించుకునే చిన్ననాటి దోస్తులంతా 22 సంవత్సరాల తరువాత ఒకే చోట కలుసుకున్నారు. వారి కలయికకు చందేపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ వేదిక అయింది. యాదాద్రి భువనగిరి జిల్లా, మోటకొండూరు మండలంలోని చందేపల్లి గ్రామంలో ఉన్న ప్రభుత్వ ఉన్న త పాటశాలలో 2001-2002 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు పాటశాల ఆవరణలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. మొదట పరిచయ కార్యక్రమంతో మొదలయిన కార్యక్రమం వారికి విద్య బుద్ధులు నేర్పిన గురువులను సన్మానించుకున్నారు. పాటశాల మొత్తం తిరుగుతూ ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటు సరదాగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఉ పాధ్యాయులు ప్రభాకర్ నవీన్ రెడ్డి, లాలు, ఆంజనేయులు, జానయ్య, విజయ్, విద్యార్థులు నరేష్ బాబు, సంజీవ, శ్రీను, సంతోష్, నవీన్, నరసింహులు, అంజిరెడ్డి, గణేష్, తిరుమల, బాలకృష్ణ, సుచరిత, రమాదేవి, రజని, మంజుల, అనిత, అరుణ, స్వరూప, మంజుల, సావిత్రి, కళ్యాణి, అనిత, ఉమారాణి, తదితరులు పాల్గొన్నారు.



# గొల్లచర్లలో రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడోత్సవాలు.

**- జూన్ 7,8,9 తేదీలలో నిర్వహించే కబడ్డీ టోర్నమెంట్ కు ఏర్పాట్లు సిద్ధం.**



డోర్నకల్, జూన్ 06 (తీన్మార్ న్యూస్): క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసి ప్రపంచానికి తెలియజేయాలని, అందరితో స్నేహపూర్వక సంబంధాలు పెంచుటకు క్రీడలను ప్రోత్సహించాలని ఉద్దేశంతో తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ తెలుగు రాష్ట్ర స్థాయి కబడ్డీ క్రీడోత్సవాలను విజయవంతం చేయాలని కబడ్డీ టోర్నమెంట్ ఆర్గనైజేషన్ కమిటీ సభ్యులు తెలిపారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం గొల్లచర్ల గ్రామంలో రాష్ట్ర కమిటీ అసోసియేషన్ అనుమతితో జూన్ 7,8, 9 తేదీలలో కాజా బాయ్ మెమోరియల్, టీచర్లు గొర్ల సోమిరెడ్డి,గుగ్గిళ్ళ కృష్ణమూర్తి, చే రెడ్డి మురళీధర్ రెడ్డి, సురభి శ్రీను, కొండపర్తి సుందర చారి,భీమన బోయిన రవి క్రీడాకారుల జ్ఞాపకార్థంతో రెండు రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడోత్సవాలు నిర్వహించబోతున్నాము ఆసక్తి కలిగి ఉన్న క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ ఫోన్ నెంబర్స్ 9951559949, 9705892250 కు సంప్రదించగలరని తెలిపారు. మొదటి బహుమతి 50,000, ద్వితీయ బహుమతి 40,000,తృతీయ బహుమతి 35000, నాలుగో బహుమతి 30, 000, ఐదో బహుమతి 25000, ఆరో బహుమతి 20000, ఎంట్రీ ఫీజు 500 రూపాయలు ప్రతి బహుమతికి షీల్డ్ అందజేయడం జరుగుతుందని టోర్నమెంట్ ఆర్గనైజేషన్ కమిటీ అధ్యక్షులు భీమనబోయిన సంతోష్,ఉపాధ్యక్షులు కొడవండ్ల యాదగిరి, చెట్టుపల్లి ఉప్పయ్య, ప్రధాన కార్యదర్శి తోట ప్రసాద్,సహాయ కార్యదర్శి లు పగిడిపల్లి రామకృష్ణ, చెరుకుపల్లి శ్రీనివాస్, కోశాధికారి గొడుగు సురేష్, కార్యవర్గ సభ్యులు చంద మహేష్, భీమనబోయిన సాగర్ తెలిపారు. అదేవిధంగా ఈ కబడ్డీ టోర్నమెంట్ కి సహకరించిన బహుమతుల దాతలు,అన్నదాత ధాత కల్లెపు సతీష్ కుమార్ గౌడ్,మంచినీళ్ల దాతలు కొడవండ్ల వెంకన్న, జంగాల రాజీవ్, గోపి వెంకన్న, విజయ గార్డెన్ బాదావత్ శంకర్ నాయక్, కబడ్డీ క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేసిన రమణ బోయిన రాజుకు, సహా సహకారాలు అందించిన ఇతర దాతలకు కమిటీ సభ్యుల తరపున ప్రతి ఒక్కరికి పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కబడ్డీ టోర్నమెంట్లో క్రీడాకారులు నియమ నిబంధనలు పాటించాలని, దూర ప్రాంతాల నుంచి వచ్చే క్రీడాకారులకు అన్ని రకాల సౌకర్యం కలదని కమిటీ సభ్యులు తెలిపారు.

# పిజి నాల్గవ సెమిస్టర్ పరిక్ష టైం టేబుల్ ను రీషెడ్యూల్

**రీషెడ్యూల్ చేస్తూ ప్రకటన విడుదల చేసిన పరిక్షల నియంత్రణ అధికారి**

హన్మకొండ కేయు, జూన్ 06 (తీన్మార్ న్యూస్): కాకతీయ విశ్వవిద్యాలయ పిజి నాల్గవ సెమిస్టర్ పరిక్షా టైం టేబుల్ ను రీషెడ్యూల్ చేస్తూ పరిక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎస్.నరసింహ చారి, అదనపు పరిక్షల నియంత్రణ అధికారిణి డాక్టర్ బి.ఎస్.ఎల్. సౌజన్య నేడు విడుదల చేసారు, ఇందులో మొదటి పేపర్ జూన్ 11 వ తేదిన, రెండవ పేపర్ జూన్ 13 వ తేదిన మూడవ పేపర్ జూన్ 15 వ తేదిన, నాల్గవ పేపర్ జూన్ 19 వ తేదిన, ఐదవ పేపర్ జూన్ 21 వ తేదిన అరవ పేపర్ జూన్ 24 వ తేదిన ఉనట్టు వారు తెలిపారు, పరిక్షలు మధ్యహ్నాం 2.00 గంటల నుంచి 5.00 గంటల మధ్య జరుగుతాయి అని వారు పెరుకొన్నారు, మరిన్ని వివరాలు వెబ్ సైట్ లో www.kakatiya.ac.in లో చూడవచ్చు అని తెలిపారు.

# విద్యను వ్యాపారంగా మారుస్తున్న కార్పొరేట్ పాఠశాలలు

**ఫీ రెగ్యులేటర్ కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్**

**పిడిఎస్యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకటరెడ్డి**




హన్మకొండ కేయు, జూన్ 06 (తీన్మార్ న్యూస్): కాకతీయ యూనివర్సిటీలో జాఫర్ నిజాం సెమినార్ హాల్లో పిడిఎస్యూ కాకతీయ యూనివర్సిటీ కార్యవర్గం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పిడిఎస్యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకటరెడ్డి మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే విద్యా వ్యాపారానికి ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు తెరలేపుతున్నాయన్నారు. లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల పైన మోయలేని భారాన్ని మోపుతున్నారు అన్నారు, ఇంటర్నేషనల్, పబ్లిక్, సీబీఎస్సీ పేర్లతో లక్షలలో ఫీ వసూలు చేస్తున్నారని అన్నారు. అంతేకాదు పుస్తకాలు యూనిఫామ్ బ్యాడ్జీల పేరుతో ఒక్కో విద్యార్థి దగ్గర నుండి 10000 నుండి 20 వేల వరకు వసూలు చేస్తున్న అధికారులు స్పందించకపోవడం శోచనీయమన్నారు. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం స్పందించి విద్యను వ్యాపారంగా మారుస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఫీ రెగ్యులేటర్ కమిటీని ఏర్పాటు చేయాలని విద్యాసంస్థల్లో విద్యాహక్కు చట్టం క్రింద ప్రతి పాఠశాలలో 25% సీట్లను కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో పిడిఎస్యూ నగర అధ్యక్షులు రాచకొండ రంజిత్ కుమార్ కాకతీయ యూనివర్సిటీ ప్రధాన కార్యదర్శి మంద్రి మహేష్ వంశీ కుమారు గోవర్ధన్ దేవేందర్ సాయిచంద్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సొంత మండలంలో సత్తా చాటిన బిజెపి

**- పెద్ద మందడి బిజెపి పార్టీ మండల అధ్యక్షులు కె. తిరుపతయ్య**



వనపర్తి నియోజకవర్గం ప్రతినిధి, జూన్ 06(తీన్మార్ న్యూస్): మంగళవారం జరిగినటువంటి నాగర్కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ పార్లమెంట్ ఎన్నికలలో పెద్దమందడి మండల భారతీయ జనతా పార్టీ సత్తా చాటింది అని పెద్దమందడి బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు కె.తిరుపతయ్య (గున్న బాయ్) హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే సొంత మండలంలో ప్రజలు బిజెపిని ఆదరించింది. పెద్దమందడి మండల పరిధిలో 776 ఓట్లు మెజార్టీ పోలయ్యాయి అని కె.తిరుపతయ్య సంతోషం వ్యక్తం చేశారు. బిజెపి పార్టీని గుండెల్లో పెట్టుకున్న ప్రజలకు ప్రతి గ్రామంలో దాదాపుగా లీడ్ రావడం మండల ప్రజలు బిజెపి పైన చూపిన ప్రేమకు, మేము మా పార్టీ తరఫున పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి గ్రామంలోని బిజెపి నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి పార్టీపై మరింత నమ్మకం కలిగేలా ప్రజలకు చెరువులో ఉంటామని సంతోషం వ్యక్తం చేశారు.

# లేబుల్ లు సరిగ్గా లేని నకిలీ విత్తనాలు గుర్తింపు

**- ఫెట్టిలైజర్ షాపులలో ఆకస్మిక తనిఖీలు**

**- రూ.1,22,000/- రూపాయల విలువగల విత్తనాలు సీజ్**





భువనగిరి జిల్లా ప్రతినిధి, జూన్ 06(తీన్మార్ న్యూస్): రామన్నపేట మండల పరిధిలోని రామన్నపేట, కక్కిరేని, ఎన్నారం, మునిపంపుల గ్రామాలలో గల ఫెటిలైజర్ షాపులలో ఏడిఏ భువనగిరి బి.దేవసింగ్, రామన్నపేట మండల వ్యవసాయాధికారి పద్మజ లు కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో రూ.1,22,000/- రూపాయల విలువగల విత్తనాల ప్యాకెట్ లకి లేబుల్ లు సరిగా లేవని గుర్తించి సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీలో షాపులకు లైసెన్స్ కలిగి ఉన్నాయా, లేవా మరియు విత్తనాలు స్టాకు సంబంధించి లైసెన్స్ స్టార్ట్ నుండి తెచ్చారా, లేదా అని పరిశీలించారు. విత్తన స్టాప్ వివరాలను వాటి ధరలను ప్రతిరోజు స్టాక్ బోర్డులు నమోదు చేయాలని స్థానిక వ్యవసాయ శాఖ అధికారులకు తెలియజేయాలని తెలిపారు. రైతులు కొనుగోలుకు వచ్చేటప్పుడు స్టాక్ బోర్డులో ఉన్న ఏ విత్తనాలైనా అడిగి తీసుకోవచ్చని ఇందుకు ఏ ఒక్క డీలరు నిరాకరించిన ఉన్నదానికంటే ఎక్కువ ధర కి అమ్మిన స్థానిక వ్యవసాయ శాఖ అధికారికి ఫోన్ ద్వారా గాని ఏ రకంగా గాని ఫిర్యాదు చేసిన తో వారిపై తక్షణమే తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు. రైతులు కచ్చితంగా కొనుగోలు చేసిన వాటికి బిల్లులు తీసుకోవాలని వాటిని పంట పూర్తయ్యే వరకు భద్రపరచుకోవాలని లైసెన్సులు ఉన్న డీలర్ల దగ్గర విత్తనాలు కొనుగోలు చేయాలని రైతులను కోరారు.

# నక్కిలి విత్తనాలను అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటాం

**- ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేసిన వ్యవసాయ అధికారి సైదులు యాదవ్, హెడ్ కానిస్టేబుల్ శాంతయ్య..**





వనపర్తి నియోజకవర్గం ప్రతినిధి, జూన్ 06(తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పెద్దమందడి మండల కేంద్రంతో పాటు మొజర్ల గ్రామంలో గురువారం ఫర్టిలైజర్ షాపులను వ్యవసాయ అధికారి సైదులు యాదవ్. పెద్దమందడి కానిస్టేబుల్ శాంతయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నక్కిలి విత్తనాలను అన్ని రైతులకు మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. రైతులు విత్తనాలు తీసుకున్న వెంటనే రసీదులు చెల్లించాలని అన్నారు. ఫర్టిలైజర్ షాపులకు తప్పనిసరిగా ప్రభుత్వం లైసెన్స్ కలిగి ఉండాలని అన్నారు కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

# తిరుమలయ్య గుట్ట ఆంజనేయ స్వామికి నైవేద్యం సమర్పించిన ఎమ్మెల్యే



వనపర్తి ప్రతినిధి, జూన్ 06(తీన్మార్ న్యూస్): గురువారం అమావాస్యను పురస్కరించుకొని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తిరుమలయ్య గుట్ట ఆంజనేయ స్వామి వారికి నైవేద్యాన్ని సమర్పించారు. పెద్దగూడెం గ్రామస్తులు విష్ణువర్ధన్ రెడ్డి, సునీత కుటుంబం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే స్వామివారికి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తిరుమలయ్య గుట్ట పైన ఉన్న వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని కొబ్బరికాయలు కొట్టారు. ప్రతి అమావాస్యకు తిరుమలయ్య గుట్ట వద్ద ఉన్న ఆంజనేయ స్వామి వారి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం, భజనలు, కోలాటాలు, బొడ్డెమ్మలు జరుగుతూ ఉంటాయని, భక్తి భావాన్ని పెంపొందించుకునేందుకు గ్రామాలలో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దగూడెం గ్రామస్తులు వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# విప్,ఆలేరు ఎమ్మెల్యే ఐలయ్య కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన టిజెయు జిల్లా అధ్యక్షులు షానూర్



యాదగిరిగుట్ట టౌన్, జూన్ 06(తీన్మార్ న్యూస్): ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య జన్మదిన సందర్భంగా యాదగిరిగుట్ట పట్టణంలోని వారి నివాసం వద్ద ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకల కార్యక్రమంలో తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ షానూర్ హాజరై జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. వారితోపాటు జిల్లా గౌరవ అధ్యక్షులు చిన్నబతిని మత్స్యస్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోపరాజు వెంకన్న, విశ్వబ్రాహ్మణ జర్నలిస్ట్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాములపర్తి లక్ష్మీనారాయణ, ఆలేరు మండల ప్రధాన కార్యదర్శి గంగదారి శ్రవణ్, కోశాధికారి చింత కింది కృష్ణ, ఎలుగల శ్రీనివాస్, సిద్ధార్థ, తదితరులు పాల్గొన్నారు.

# నీట్ లో 67 మందికి ఫస్ట్ ర్యాంక్

న్యూఢిల్లీ, జూన్ 6: ట్ యూజీ ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) జూన్ 4న వెల్లడించిన సంగతి తెలిసిందే. దేశ వ్యాప్తంగా మొత్తం 23.33 లక్షల మంది విద్యార్థులు నీట్ యూజీ పరీక్షకు హాజరుకాగా వీరిలో 13.16 లక్షల మంది ఉత్తీర్ణత సాధించారు. తెలంగాణ నుంచి నీట్ యూజీ పరీక్షకు మొత్తం 79,813 మంది దరఖాస్తు చేసుకోగా, వారిలో 77,849 మంది పరీక్ష రాశారు. ఇందులో 47,371 మంది కనీస అర్హత మార్కులు సాధించారు. దేశ వ్యాప్తంగా చూస్తే 67 మంది విద్యార్థులకు 99.997129 పర్సంటైల్ వచ్చింది. సాధారణంగా ఆలిండియా ఫస్ట్ ర్యాంకు ఒకరికో, ఇద్దరికో వస్తుంది. కానీ నీట్ యూజీలో మాత్రం ఏకంగా 67 మందికి రావడం ఒకింత ఆశ్చర్యానికి గురిచేసింది. వీరందరికీ ఒకే పర్సంటైల్ వచ్చింది. ఆలిండియా ఫస్ట్ ర్యాంక్ వచ్చిన వారిలో ఆంధ్రప్రదేశ్ నుంచి నలుగురు విద్యార్థులు ఉండటం విశేషం. ఫస్ట్ ర్యాంకు సాధించిన వారిలో 14 మంది అమ్మాయిలు, 53 మంది అబ్బాయిలు ఉన్నారు. రాజస్థాన్ నుంచి అత్యధికంగా 11 మంది విద్యార్థులు ఒకటో ర్యాంకు సాధించారు.నీట్‌లో అర్హత సాధించిన వారందరికీ కౌన్సెలింగ్ నిర్వహించి ఎంబీబీఎస్, బీడీఎస్ వంటి తదితర కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఇక తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్‌కు చెందిన అనురన్ ఘోష్ అనే విద్యార్థి 77వ ర్యాంకు సాధించాడు. దీంతో ఈసారి తెలంగాణ నుంచి 100లోపు ర్యాంకు కేవలం ఒకరు మాత్రమే సాధించినట్లైంది. కాగా నీట్ యూజీ 2024 పరీక్ష మే 5వ తేదీన దేశ వ్యాప్తంగా పలు పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన సంగతి తెలిసిందే

# మేధావులతో మేధోమధన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**ఆహ్వాన కరపత్రికల ఆవిష్కరణలో సొసైటీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు లింగమల్ల శంకర్**



మల్హర్ రావు: మేధావులతో..మేధోమధనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ రిజిస్ట్రేషన్ 542 వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు లింగమల్ల శంకర్ పిలుపునిచ్చారు బుధవారం మండలంలోని కొయ్యూర్ కమ్యూనిటీ హాలో ఏవైయూ కాళేశ్వరం జోనల్ అధ్యక్షుడు చింతల కుమార్ యాదవ్,ఉపాధ్యక్షుడు బండి సుధాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశానికి సొసైటీ జాతీయ అధ్యక్షురాలు వేముల జ్యోతి, కార్యవర్గ సభ్యుడు బండి రాజయ్య ముఖ్యదితులుగా హాజరై మేధావులతో మేధోమధన కార్యక్రమ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లింగమల్ల దంపతులు మాట్లాడారు మెరుగైన సమాజ నిర్మాణం కోసం,మహనీయుల ఆశయ సాధన కోసం మేధావులతో మేధోమధన కార్యక్రమాన్ని ఈ నెల 9న పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని గాయత్రి డిగ్రీ కాలేజీ దగ్గర టిచర్స్ కాలనిలో కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని,ఈ కార్యక్రమాన్నీ సొసైటీలో విధులు నిర్వహిస్తున్న అన్ని శాఖల సభ్యులు,ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజా సంఘాల నాయకులు,అంబెద్కర్ వాదులు,అన్ని వర్గాల ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈడబ్ల్యూఎస్ కాళేశ్వరం జోనల్ కార్యదర్శి రావుల మొగిలి, జిల్లా కార్యదర్శి కేశారపు సురేందర్,ఏఏప్ యూ జిల్లా ఉపాధ్యక్షుడు కొండ్ర సారయ్య, ఏడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు కొండ రాజమ్మ, కాటారం డివిజన్ అధ్యక్షురాలు కొండూరి మమత,ఏఎస్ యూ కాళేశ్వరం జోనల్ కార్యదర్శి బండి రణదీర్ రావు, ఏవైయూ జిల్లా కార్యదర్శి గుగ్గిళ్ల రాజ్ కుమార్,రాజమ్మ,సభ్యులు పాల్గొన్నారు.

# టీపీఎస్సీ రూల్స్ ప్రకారం గ్రూప్ 1 పరీక్ష నిర్వహించాలి

సిద్దిపేట: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మార్గదర్శకాల ప్రకారం గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణపై పరీక్షల అబ్జర్వర్లు మరియు చీఫ్ సూపరింటెండెంట్ అధికారులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీన గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్ష జిల్లాలో 21 కేంద్రాలలో జరగనుందని ఈ పరీక్షలో 8223 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని అన్నారు. పరీక్ష నిర్వహణకు ప్రతి కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్ ను నిర్వహించడం జరిగిందని ప్రతి పరీక్ష కేంద్రంలో టీజీపీఎస్సీ నిబంధన లకు అనుగుణంగా అభ్యర్థుల సౌకర్యం త్రాగునీరు, మరుగుదొడ్డి, ఫర్నిచర్, విద్యుత్ దరితర సౌకర్యాలను ముందస్తుగా ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. ముఖ్యంగా టీజీపీఎస్సీ ఆదేశాల ప్రకారం పరీక్ష నిర్వహణ రోజు నిర్ణీత సమయంలోనే పరీక్ష నిర్వహించాలని పరీక్ష పూర్తయ్య వరకు పరీక్ష కేంద్రాల నుండి ఎవరికి బయటకు పంపడానికి వీలులేదని అన్నారు. పరీక్ష ముందు అభ్యర్థులను పరీక్ష కేంద్రం మెయిన్ గేటు వద్ద తనిఖీలు చేయాలని, పరీక్ష హాల్లోకి వెళ్లేటప్పుడు మరొకసారి తనిఖీ చేయాలని అన్నారు. అభ్యర్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్ష హాల్లోకి తీసుకురాకుండా జాగ్రత్త పడాలని అన్నారు. ప్రతి పరీక్ష కేంద్రాల వద్ద తప్పకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. హాల్ టికెట్ పై ఫోటో లేకపోయినా, పేరు తప్పు పడిన అభ్యర్థుల నుండి అఫిడవిట్ ని తీసుకోవాలని అన్నారు.పరీక్ష రాసే అభ్యర్థులు ఓఎంఆర్ షీట్లో వారి వివరాలను సరిగా రాశారో లేదో ఇన్విజిలేటర్ల ద్వారా చెక్ చేయించాలని అన్నారు. అంద దివ్యాంగ అభ్యర్థులకు పరీక్ష రాసేందుకు సహాయకులుగా ఇంటర్మీడియట్ లేదా ఆలోపు చదివిన వారికి మాత్రమే అవకాశం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ గరిమ అగ్రవాల్, ఇందూరు కళాశాల ప్రిన్సిపాల్ విపి రాజు,అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, తదితరులు పాల్గొన్నారు.


# డబుల్ డిజిట్ .. పని చేయని ఫార్ములా...

హైదరాబాద్: తీవ్ర ఉత్కంఠ నడుమ కాంగ్రెస్ అధికారాన్ని చేజిక్కించుకుంది. అసెంబ్లీ ఎన్నికల పరిణామాలతో అలర్ట్ అయిన పార్టీలు పార్లమెంట్ ఎలక్షన్‌లో డబుల్ డిజిట్‌ను టార్గెట్‌గా పెట్టుకున్నాయి. ఎన్నికల ప్రచారంలో 10 స్థానాలకు పైగా గెలుపే లక్ష్యంగా పని చేశాయి. కానీ, ఏ పార్టీ కూడా ఈ టార్గెట్‌ను రీచ్ కాలేదు.అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపుతో ఊపు మీదున్న కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల్లోనూ అదే హవాను కొనసాగించాలని అనుకుంది. 14 సీట్లలో గెలుపే లక్ష్యంగా అడుగులు వేసింది. బలమైన అభ్యర్థులను ఏరికోరి బరిలో నిలిపింది. కొన్ని స్థానాల్లో గెలుపు అంచనా ముందే వేసినా, మరికొన్నిచోట్ల కష్టపడితే డబుల్ డిజిట్ కచ్చితంగా అందుకోవచ్చని అనుకుంది. ఢిల్లీ నుంచి పార్టీ పెద్దలను పట్టుకొచ్చి విస్తృతంగా ప్రచారం చేసింది. సీఎం రేవంత్ రెడ్డి సుడిగాలి పర్యటనలు చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ తప్పులను ఎత్తిచూపుతూ, కాంగ్రెస్ గెలుపు అవసరాన్ని వివరిస్తూ ప్రచారం చేశారు. కాంగ్రెస్ శ్రేణులు కూడా ఎంతో ఉత్సాహంగా ప్రచారం చేసి అభ్యర్థుల గెలుపు కోసం కష్టపడ్డారు. కానీ, అనుకున్న 14 సీట్ల టార్గెట్‌ని మాత్రం రీచ్ కాలేకపోయింది కాంగ్రెస్.దెబ్బ తిన్న పులి తిరిగి పంజా విసిరితే తట్టుకోలేరంటూ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత కేసీఆర్ గురించి తెగ ఊదరగొట్టాయి బీఆర్ఎస్ వర్గాలు. పార్లమెంట్ ఎన్నికలపై ఎన్నో ఆశలు పెట్టుకున్నాయి. 5 నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని ఇటు మీడియా ముందు, అటు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేశాయి. 12 సీట్లలో గెలుస్తామని కేసీఆర్ కూడా ధీమాగా చెప్పారు. బస్సు యాత్ర పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఏదో తిట్టామన్నట్టుగా బీజేపీపై విమర్శలు చేసి యాత్రను మమ అనిపించారు. చివరకు 12 కాదు కదా, ఘోర పరాజయాన్ని చవి చూశారు.పదేళ్ల పాటు తిరుగులేని అధికారం చెలాయించిన బీఆర్ఎస్ పతనం అంచున పయనిస్తున్నట్లు కనిపిస్తోంది. అసెంబ్లీ ఎన్నికలలో కనీసం ప్రతిపక్ష హోదా అయినా దక్కించుకున్న గులాబీ పార్టీ పార్లమెంట్ ఫలితాలు వచ్చే నాటికి కేవలం సింగిల్ డిజిట్ లేక సున్నా స్థానాలతో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి కనిపిస్తోందని రాజకీయ పండితులు చెబుతున్నారు. ఎగ్జిట్ పోల్స్ కూడా గంపగుత్తగా బీఆర్ఎస్ పరిస్థితి దాదాపు ఇంతే అన్నట్లుగా అంచనా వేశాయి. ఎమ్మెల్సీ విజయం చూపించి కార్యకర్తలలో ఆత్మస్థయిర్యం నింపే ప్రయత్నాలు చేస్తున్నారు బీఆర్ఎస్ అగ్రనేతలు. నేటి ఫలితాల తర్వాత పార్టీ పరిస్థితి ఏమిటని బీఆర్ఎస్ నేతలు ఆలోచనలో పడ్డారు. ఇప్పటికే ఇతర పార్టీలకు వలస వెళ్లిన నేతలతో సహా కొత్తగా మరింతమంది పార్టీని వీడే సూచనలు కనిపిస్తున్నాయి అంటున్నారు రాజకీయ విశ్లేషకులు.అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ షేర్ పెంచుకుంది బీజేపీ. జాతీయ అంశాలే కీలకంగా ఉండే పార్లమెంట్ ఎన్నికల్లోనూ 10-12 సీట్లను టార్గెట్‌గా పెట్టుకుని పని చేసింది. మోదీ, అమిత్ షా, నడ్డా ఇలా జాతీయ నేతలంతా తెలంగాణకు క్యూ కట్టి ప్రచారం చేశారు. ఔర్ ఏక్ బార్ మోదీ సర్కార్ అంటూ నినదించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను తిట్టిపోశారు. కానీ, టార్గెట్‌ను మాత్రం అందుకోలేకపోయారు. డబుల్ డిజిట్‌కు తక్కువగానే సీట్లను సాధించారు. కానీ, పెరిగిన ఓట్ షేర్ బీజేపీకి బూస్టప్ అని రాజకీయ పండితులు అంచనా వేస్తున్నారు. మొత్తంగా మూడు ప్రధాన పార్టీల డబుల్ డిజిట్ ఆశ నెరవేరలేదు.

# మా నుంచి హేమ సస్పెండ్

హైదరాబాద్, జూన్ 6: మా అసోసియేషన్ నుంచి నటి హేమను సస్పెండ్ చేస్తూ అధ్యక్షుడు మంచు విష్ణు కీలక నిర్ణయం తీసుకున్నారు. తాజాగా ఆమె మా సభ్యత్వాన్ని రద్దు చేశామని ఆయన మీడియా సమావేశంలో వెల్లడించారు. క్యారెక్టర్ ఆర్టిస్టుగా తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమైన హేమ సినిమా కెరియర్ ప్రమాదంలో పడింది.. ఇటీవల బెంగళూరులో రే× పార్టీ, మాదకద్రవ్యాల కేసులో ఆమె తీవ్ర ఆరోపణలు ఎదుర్కొన్నారు. అందులో ఆమె పాల్గొన్నట్టు, బెంగళూరు పోలీసులు కీలక ఆధారాలు చూపించడంతో ఒక్కసారి నిందితురాలైపోయారు. వాస్తవానికి ఆ వ్యవహారంతో తనకు సంబంధం లేదని హేమ చెప్పారు. అందుకు సంబంధించి ఒక వీడియో కూడా విడుదల చేశారు. ఆ మరుసటి రోజు తన ఇంట్లో చికెన్ బిర్యాని వండుతూ కనిపించారు. కొద్ది రోజులకు మామిడికాయ పచ్చడి పెట్టే విధానం ఇదీ అంటూ మరొక వీడియోతో సందడి చేశారు. ఇలా ఎన్ని రకాల జిమ్మిక్కులకు పాల్పడినప్పటికీ బెంగళూరు పోలీసులు ఊరుకోలేదు. చివరికి ఆమె శరీరంలో రక్త నమూనాలను పరిశీలించి.. మాదకద్రవ్యాలు తీసుకున్నట్టు నిర్ధారించారు.రే× పార్టీకి సంబంధించిన కేసు హై ప్రొఫైల్ పరిధిలోది కావడం, మీడియా, సోషల్ మీడియాలో దీని గురించి విస్తృతంగా వార్తలు ప్రసారం కావడంతో కర్ణాటక ప్రభుత్వం చాలా సీరియస్ గా తీసుకుంది. ఈ వ్యవహారంలో ఎంతటి వారు ఉన్నా వదిలిపెట్టకూడదని పోలీసులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. బెంగళూరు నగర పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందం ఈ కేసును విచారిస్తోంది. రే× పార్టీ, మాదకద్రవ్యాల కేసులో ఇప్పటికే 70 మంది అనుమానితులను పోలీసులు నిందితుల జాబితాలో చేర్చారు. అందులో శరీర రక్త నమూనాలలో పాజిటివ్ గా తేలిన వారిపై కేసులు నమోదు చేసి, అదుపులోకి తీసుకున్నారు.." రే× పార్టీ నిర్వహించింది ఎవరు? మాదకద్రవ్యాలు సరఫరా చేసింది ఎవరు? ఆరోజు పార్టీలో ఎవరెవరున్నారు? ఎలాంటి కార్యకలాపాలకు పాల్పడ్డారు? గతంలో ఇలాంటి పార్టీలకు ఎప్పుడైనా హాజరయ్యారా? ఈ పార్టీకి హాజరయ్యేందుకు ఎంత చెల్లించారు? ఈ పార్టీ నిర్వాహకులు మీకు ఎలా పరిచయం? అనే కోణాలలో పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.రే× పార్టీ, మాదకద్రవ్యాల కేసులో హేమ అరెస్టు అయిన నేపథ్యంలో.. మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ నుంచి ఆమెను సస్పెండ్ చేస్తారని తెలుస్తోంది. " మా" లో ఆమె సభ్యత్వాన్ని కూడా రద్దు చేసే యోచనలో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. దీనిపై మా అధ్యక్షుడు మంచు విష్ణు అధికారిక ప్రకటన విడుదల చేసే అవకాశం కనిపిస్తోంది. వాస్తవానికి ఈ పార్టీలో తాను లేనని, ఫామ్ హౌస్ లో చిల్ అవుతున్నానని చెప్పిన హేమ.. ఆ తర్వాత ఈ కేసులో అరెస్టు కావడంతో.. అంతకుముందు ఆమె వెల్లడించినవన్నీ అబద్ధాలేనని తేలిపోయింది.. ప్రస్తుతం హేమ బెంగళూరులోని పరపణ అగ్రహార జైల్లో విచారణ ఖైదీగా ఉన్నారు

## యువతి అదృశ్యం.. కేసు నమోదు



టేక్మాల్, జూన్ 06(తీన్మార్ న్యూస్): మెదక్ జిల్లా, టేక్మాల్ మండలం, సూరంపల్లి గ్రామంలో యువతి అదృశ్యం అయిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై మురళీ తెలిపిన వివరాల ప్రకారం టేక్మాల్ మండల పరిధిలోని సూరంపల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ రుక్సాన (25)ఈ నెల 4వ తేదీన ఉదయం హైద్రాబాద్ లో డిన్నర్ ఉందని చెప్పి వెళ్ళింది. అటు డిన్నర్ కు హాజరు కాలేదు ఇటూ ఇంటికీ రాకపోవడంతో ఆమే ఫోన్ కు ఫోన్ చేయగా స్విచ్చాఫ్ వచ్చింది. దీంతో ఆందోళనకు గురైనా కుటుంబ సభ్యులు బందువుల వద్ద చుట్టూ ప్రక్కల వెతికిన దొరకక పోవడంతో ఆమె తల్లి రజియా గురువారం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఇంటి నుండి వెళ్లిన సమయంలో నల్లటి బురా? ధరించి ఉంది.

# స్టూడెంట్స్ ఇళ్లకు ఆన్సర్ షీట్స్

వరంగల్: కాకతీయ యూనివర్సిటీలో మరో బాగోతం బయట పడింది. వర్సిటీ పరీక్షల విభాగంలో డిగ్రీ సెమిస్టర్ పేపర్ల మూల్యాంకనం జరుగుతుండగా, కాసులకు కక్కుర్తి పడిన కొంతమంది దినసరి కూలీలు ఆ బండిల్స్ నుంచి ఆన్సర్ బుక్ లెట్స్ ను గుట్టుగా విద్యార్థులకు చేరవేశారు. సదరు విద్యార్థులు జవాబులు రాసిన అనంతరం వాటిని తిరిగి యథావిధిగా బండిల్స్ లోకి చేర్చారు. వారం రోజుల కిందట జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి రాగా, కాకతీయ యూనివర్సిటీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పరీక్షల విభాగంలో పని చేస్తున్న దినసరి కూలీలను తొలగించి, రెండు రోజుల పాటు మూల్యాంకన ప్రక్రియ నిలిపివేశారు.కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ 2, 4, 6వ సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్నాయి. పరీక్షల నిర్వహణ అనంతరం విద్యార్థుల ఆన్సర్ బుక్ లెట్స్ అన్నింటినీ ఎగ్జామినేషన్ బ్రాంచ్ కు తరలిస్తున్నారు. ఇదిలాఉంటే డిగ్రీ పూర్తి చేసే విద్యార్థుల సౌకర్యం కోసం ఆరో సెమిస్టర్ పేపర్ల మూల్యాంకనం ప్రారంభించారు. ఇప్పటికే ఆయా పరీక్షలు పూర్తి కావస్తుండగా, మే 23న జరిగిన ఓ ఘటన ఇప్పుడు కాకతీయ యూనివర్సిటీని కుదిపేస్తోంది. వర్సిటీ పరీక్షల విభాగంలో దాదాపు 25 మంది దినసరి కూలీలుగా పని చేస్తుండగా, అందులో మాదాసి సునీల్, గడ్డం రాణా ప్రతాప్, నాసం శ్రీధర్ అనే ముగ్గురు వ్యక్తులు అక్రమాలకు తెరలేపారు. ఎవరికీ ప్రవేశం ఉండని మూల్యాంకన క్యాంప్ లోకి ఎంటర్ అవడంతో పాటు అందులో నుంచి కొన్ని ఆన్సర్ బుక్ లెట్స్ తీసుకుని బయటకు వచ్చారు.వాటిని ఆయా పేపర్ల విద్యార్థులకు చేరవేసి, వారు ఆన్సర్స్ రాసిన తరువాత వాటిని యథావిథిగా సంబంధిత బండిల్స్ లోకి చేర్చారు. ఆ ఘటన వారం రోజులకు మే 30వ తేదీన పరీక్షల విభాగం అడిషనల్ కంట్రోలర్ డా.తిరుమలదేవి సీసీ కెమెరాలు పరిశీలిస్తుండగా, గుర్తించి కంట్రోలర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు కంట్రోలర్ నరసింహచారి, అడిషనల్ కంట్రోలర్ తిరుమలదేవి కాకతీయ యూనివర్సిటీ పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఓ వైపు పోలీసులు విచారణ జరుపుతుండగా, కాకతీయ యూనివర్సిటీ అధికారులు ఆరో సెమిస్టర్ ఆన్సర్ బుక్ లెట్ల మూల్యాంకనాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు. వర్సిటీ పరీక్షల విభాగంలో పని చేస్తున్న మిగతా దినసరి కూలీలను తొలగించి, రెగ్యులర్ ఉద్యోగులకు విధులు కేటాయిస్తున్నారు. ఈ మేరకు రెండు రోజుల పాటు మూల్యాంకనం నిలిపి వేశారు. దీంతో సోమవారం మూల్యాంకన ప్రక్రియ తిరిగి మొదలు కానున్నట్లు తెలుస్తోంది.వర్సిటీ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన కేయూ పోలీసులు ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఇప్పటికే ముగ్గురూ కలిసి 50 ఆన్సర్ బుక్ లెట్స్ ను బయటకు తీసుకెళ్లి, మళ్లీ బండిల్స్ లోకి చేర్చారని ప్రాథమికంగా నిర్ధారించినట్లు సమాచారం. కాగా ఒక్కో పేపర్ కు సదరు సిబ్బంది ఐదు వేల రూపాయల నుంచి 10 వేల వరకు వసూలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఇదిలాఉంటే వారంతా కొన్నేళ్ల ఉంచి ఇదే పరీక్షల విభాగంలో పని చేస్తుండగా, ఇప్పటి వరకు ఎన్ని సార్లు ఇలా ఆన్సర్ బుక్ లెట్స్ మార్పిడి చేశారనే కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. ఆ ముగ్గురు సిబ్బంది కూడా వారికి తెలిసిన స్టూడెంట్స్, ఉద్యోగుల ద్వారానే ఈ బాగోతానికి తెరలేపినట్లు తెలుస్తోంది. ఇదిలాఉంటే వారు మార్చిన 50 బుక్ లెట్స్ లో అత్యధికంగా నగరంలోని ఓ బడా ప్రైవేటు కాలేజీకి చెందిన విద్యార్థులే ఉన్నట్లు తెలిసింది. వాస్తవానికి మూల్యాంకన క్యాంపులోకి సాధారణ వ్యక్తులకు అంత ఈజీగా ప్రవేశం ఉండదు. అలా గదిలోకి దినసరి కూలీలు ఈజీగా ఎంటర్ కావడం, బుక్ లెట్స్ మార్చడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పరీక్షల విభాగంలోని కొందరు అధికారుల సహకారం కూడా వీరికి ఉందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో పోలీసులు ఆ దిశగా కూడా ఆరా తీస్తున్నారు. పరీక్షల విభాగంలోని వాల్యూయేషన్ క్యాంప్ నుంచి పేపర్ బండిల్స్ లో ఆన్సర్ బుక్ లెట్స్ మార్చిన వ్యవహారం వర్సిటీలో హాట్ టాపిక్ గా మారగా, దీనిపై లోతుగా విచారించి బాధ్యులందరి పైనా తగిన చర్యలు తీసుకోవాలనే డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి.

# ఆర్.జి.3 ఏరియా 94% ఏ పి ఏ 96% బొగ్గు ఉత్పత్తి.

**అర్జీ త్రి జి ఎం సుధాకర్ రావు.**

కమాన్ పూర్: మే నెలలో ఆర్.జి-3 ఏరియా బొగ్గు ఉత్పత్తి 94 శాతం మరియు అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా బొగ్గు ఉత్పత్తి 96 శాతం సాధించినట్లు ఆర్ జి త్రీ జీఎం సుధాకర్ రావు తెలిపారు. మే నెల బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణా వివరాలను ఆర్.జి-3 జనరల్ మేనేజర్ ఎన్.సుధాకర రావు, ఎ.పి.ఎ ఇంఛార్జి జీ.ఎం బి.సత్యనారాయణ ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. ఆర్.జి-3 జి.ఎం ఎన్.సుధాకర రావు మాట్లాడుతూ మే నెలలో ఆర్.జి-3 ఏరియాకు నిర్దేశించిన 5.48 లక్షల టన్నులకు గాను 5.16 లక్షల టన్నులు అనగా 94 శాతం బొగ్గు ఉత్పత్తితో పాటు నిర్దేశించిన ఓ.బి (మట్టి) 31.30 లక్షల క్యూబిక్ మీటర్ల లక్షానికి గాను 30.67 క్యూబిక్ మీటర్లు అనగా 98 శాతం మట్టినీ వెలికి తీయడం జరినదని, మరియు 7.66 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేయడం జరిగిందన్నారు.

ఎ.పి.ఎ ఇంఛార్జి జి.ఎం శ్రీ బి. సత్య నారాయణ మాట్లాడుతూ అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా మే నెలకు నిర్దేశించిన 0.92 లక్షల టన్నులకు గాను 0.88 లక్షల టన్నులు అనగా 96 శాతం బొగ్గు ఉత్పత్తితో పాటు 0.87 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేయడం జరిగిందన్నారు. ఉద్యోగులందరూ బాధ్యతాయుతంగా పనిచేస్తూ సింగరేణి సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి కృషి చేయాలన్నారు.

# ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించాలి

**పెద్ద ఎత్తున మొక్కలు నాటాలి**
**చెట్లను ఇష్టారాజ్యాంగా నరికి వేయవద్దు..**
**వాటిని కాపాడుకుంటేనే మానవాళికి ప్రయోజనం**
**ప్రతి ఇంటా ఇంకుడు గుంతలు మరుగుదొడ్లు నిర్మించుకోవాలి**
**కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేసుకోవాలి..**
**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**



కరీంనగర్: చామనపల్లిలో జరిగిన ప్రపంచ పర్యావరణ దినోత్సవానికి హాజరు ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని, తద్వారా మానవాళికి ఎంతో ప్రయోజనం కలుగుతుందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలందరూ పెద్ద ఎత్తున మొక్కల పెంపకం చేపట్టా లని సూచించారు. మహిళా సంఘాలు తలుచుకుంటే ఏ పనైనా సాధ్యమవుతుందని పేర్కొన్నారు. పర్యావరణం దెబ్బతినకుండా ఉండేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎన్నో సంవత్సరాలుగా పెంచిన చెట్లను ఇష్టం వచ్చినట్లు నరికి వేయవద్దని, చిన్నపిల్లలను పెంచినట్లు వాటిని చూసుకోవాలని పేర్కొన్నారు. పొలాల్లో వరి కొయ్యలను కాల్చి వేయవద్దని, ఇలా చేస్తే చెట్లు దెబ్బతింటాయని తెలిపారు. చెట్లతోనే మానవాళికి ఎంతో ప్రయోజనం చేకూరుతున్నదని చెప్పారు. ప్రతి ఇంట్లో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలని, కూరగాయల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. అలాగే ఇంకుడు గుంతలు, మరుగు దొడ్లు నిర్మించుకోవాలని, పచ్చదనం పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. ఎక్కడపడితే అక్కడ గ్రామాల్లో చెత్తను పడేయవద్దని సూచించారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఉపాధి హామీ పథకం ద్వారా అనేక పనులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కుక్కలు, కోతుల పట్ల దయ చూపాలని, వాటికి తగిన ఆహారం అందించాలని సూచించారు. ప్రజలందరం కలిసి పర్యావరణాన్ని కాపాడుకుందామని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతోనే మానవాళికి ఎంతో లాభం చేకూరుతుందని పేర్కొన్నారు. ప్రతి ఇంటి నుంచే పర్యావరణ పరిరక్షణకు శ్రీకారం చుట్టాలని, అలాగే పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. గ్రామాల్లో విస్తృతంగా మొక్కల పెంపకం చేపట్టాలని పేర్కొన్నారు. ఉపాధి పనులను కూలీలు ఉపయోగించుకోవాలని సూచించారు.

ఈ సమావేశంలో డీఆర్డిఓ శ్రీధర్,డీపీఓ రవీందర్, ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య, యూనిసెఫ్ జిల్లా కోఆర్డినేటర్ కిషన్ స్వామి, ఎంపీడీవో సంజీవరావు, ఎంపీఓ జగన్మోహన్ రెడ్డి, ఈజీఎస్ ఏపీవో శోభారాణి, ఉపాధి హామీ కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

# పట్టణంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమాలు..

ఆర్మూర్ : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండల పరిషత్ ఆవరణలో పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించినారు.. ముఖ్యంగా పర్యావరణాన్ని కాపాడాలంటే మొక్కలను పెంచడం, అన్ని రకాల జీవజాతులను రక్షించడం , ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించుకోవాలని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పర్యావరణ రక్షణ కొరకు ప్రతిజ్ఞ చేయించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సాయిరాం, ఎంపీఓ శ్రీనివాస్, ఏపీవో సురేష్, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ ప్రశాంత్, సాంకేతిక సహాయకులు నరేష్, రాము, భరత్ వివిధ గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు. గురుకుల మహిళ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో..



పర్యావరణం పై అవగాహన పెరిగేలా ప్రధాన కూడళ్లలో నినాదాలు చేస్తూ, పాటలు పాడుతూ, మానవహారం ఏర్పాటు చేసినారు.. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జి ధనవేణి మాట్లాడుతూ భూమి పునరుద్ధరణ ఎడారీకరణ ను ఆపడం పచ్చదనాన్ని పెంపొందించేలా పలు విషయాలపై అవగాహన కల్పించటం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శరణ్య ,కళాశాల అధ్యాపక బృందం విద్యార్థినిలు పాల్గొన్నారు..

# నకిలీ పత్తి విత్తనాలను పట్టుకొన్న నీల్వాయి పోలీసులు..

**వాటి విలువ 6,75,000**

**ఒకరు అరెస్ట్, పరారిలో ముగ్గురు నిందితులు.**

రామగుండం: నీల్వాయి పోలీసులు- వ్యవసాయ అధికారులు సంయుక్తంగా, నకిలీ పత్తి విత్తనాల గురించి నమ్మదగిన సమాచారం అందుకున్న పోలీసులు మరియు వేమనపల్లి మండలం వ్యవసాయ అధికారితో కలిసి వేమనపల్లిలో ఫెర్రీ పాయింట్‌కి వెళ్లి ఎద్దుల బండి ద్వారా 205 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను రవాణా చేస్తున్న నిందితుడు ఏ.1 కోలా సాయికిరణ్, కులం కోటపల్లి సిరొంచ, మహారాష్ట్ర రాష్ట్రంలోని గడ్చిరోలి జిల్లా పట్టుకోవడం జరిగింది. పోలీస్ వారిని చూసి ఏ.2 కోలా రమేష్ కులం కప్వార్ సిరొంచ, గడ్చిరోలి జిల్లా లో పారిపోవడం జరిగింది. ఇట్టి నకిలీ విత్తనాల విలువ 6,75,000 ఉంటుంది. నకిలీ పత్తి విత్తనాలను మంచిర్యాల జిల్లాలో విక్రయించి అధిక లాభం పొందాలి అనుకొన్నారు. ఎ.1 ను విచారించగ నకిలీ విత్తనాలు ఏ.3 సుమిత్ మరియు ఎ.4 జంగా సంపత్ మహారాష్ట్ర రాష్ట్రానికి చెందిన తాలా కేకేడే, ద్వారా సరఫరా చేయబడ్డాయి



అని తెలిపాడు. ఏ.1ను నకిలీ పత్తి విత్తనాలతో పాటు ఒక ఎద్దుల బండిని పీఎస్ నీల్వాయికి తీసుకొచ్చి కేసు నమోదు చేయడం జరిగింది. నకిలీ విత్తనాలు మరియు నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన నీల్వాయి ఎస్సై శ్యామ్ పటేల్, మరియు కానిస్టేబుల్ రాజేందర్,రాజశేఖర్ లను సీపీ ప్రత్యేకంగా అభినందించి రివార్డ్ అందచేయడం జరిగింది.

# అభివృద్ధి పనులకు ఇసుక కేటాయించాలి

జయశంకర్ భూపాలపల్లి, ప్రభుత్వ అభివృద్ధి పనులకు, నిర్మాణాలకు ఇసుక తరలింపుకు అనుమతులు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా కాటారం మండలంలోని విలాసాగర్ గ్రామ సమీపంలోని మానేరు నది ఇసుక రీచ్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడుతూ కాటారం మండలంలోని పలు ప్రభుత్వ అభివృద్ధి పనుల రీత్యా ఇసుక రవాణా కోసం విలాసాగర్ గ్రామ సమీపంలోని మానేరు నది నుండి ఇసుక రవాణాకు అవకాశం ఇవ్వాలని అన్నారు. 5 హెక్టార్ల కు గాను నీటి సామర్థ్యాన్ని పరిశీలించి నివేదికలు అందచేయాలని భూ గర్భ జలవనరుల శాఖ అధికారిని ఆదేశించారు . ఇందుకు గాను మొత్తం 12.5 ఎకరాలకు ఒక బౌండరిని ఏర్పాటు చేయాలని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఏదైనా కాంట్రాక్ట్ పనులకు గాని ఇతరత్రా ప్రయివేట్ నిర్మాణాలకు కానీ ఇసుక రవాణాకు అనుమతులు ఇచ్చినా, అక్రమంగా ఇసుక రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నూతన ఇసుక రీచ్ లు ఏర్పాటుకు కావలసిన



అనుమతులు, ఈసి లను సిద్ధం చేసి త్వరితగతిన నివేదికలు అందజేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మైనింగ్ అధికారి జయరాజు, భూ గర్భ జలవనరుల అధికారి శ్రీనివాసరావు, కాటారం తహసిల్దార్ నాగరాజు, ఇరిగేషన్ ఏఈ లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వానికి ధన్యవాదాలు

**ఆఫ్ లైన్ లోనే పదోన్నతులు, బదిలీలు నిర్వహించాలి**

జగిత్యాల, ఉపాధ్యాయుల పదోన్నతులు,బదిలీల ప్రక్రియకు తెలంగాణ విద్యాశాఖ జూన్ 7 నుండి జూన్ 20 వరకు బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ నిర్వహించాలని కమిషనర్ కు మౌఖిక ఆదేశాలిచ్చిన ప్రజాపాలన ప్రభుత్వం కు ధన్యవాదాలు తెలుపుతూ తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు గంగాధరి మహేష్,ప్రధాన కార్యదర్శి సర్వ సతీశ్,కోశాధికారి గొల్లపల్లి మహేష్ గౌడ్ సంయుక్తంగా బుధవారం పత్రిక ప్రకటన విడుదల చేసారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదోన్నతులు, బదిలీల కోసం ఎన్నో సంవత్సరాలు గా ఉపాధ్యాయులు ఎదురు చూస్తున్నరని ప్రభుత్వం యుద్ధప్రాతిపాదికన బదిలీలు,పదోన్నతులు ప్రక్రియను చేపడుతుండడంతో ఉపాధ్యాయులంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారని బదిలీలు పదోన్నతులు ఆఫ్ లైన్ లో నిర్వహించాలని గతంలో జిల్లాలు పెద్దవి గా ఉండడం కారణం గా ఆన్లైన్ విధానం లో బదిలీలు జరిపారని కానీ వాస్తవ రూపం లోకి వచ్చేసరికి ఆన్లైన్ విధానం విఫలం అయిందని ఇప్పుడు జిల్లాల విస్తీర్ణం చాలా తగ్గినది మరియు ఒక 2018 వారు తప్పితే మిగిలిన వారు అందరూ లాంగ్ స్టాండింగ్ వారు కావున దాదాపు తొంబై శాతం వారు అన్ని పాఠశాలల ను ఆన్లైన్ లో ఎన్నుకోవడం అత్యంత క్లిష్టమైన అంశంగా మారుతుందని గతంలో చాలా మంది ఉపాధ్యాయులకు కంప్యూటర్ పరిజ్ఞానం పై సరైన అవగాహన లేక ఆన్లైన్ లో జరిగిన పొరపాటుల వల్ల బదిలీలు,పదోన్నతుల లోవారు అనుకున్న చోటకు బదులుగా వేరే స్థానంకు బదిలీ అయి మనోవేదన తో విధులు నిర్వహిస్తున్నారని అలాగే స్పౌజ్ బదిలీల్లో కూడా ఆన్లైన్ విధానంలో అనేక అనుమానా లకు, అవకతవకలకు అవకాశం ఉందని ఇది గతంలో చూశామని ఉపద్యాయులందరికి న్యాయం జరగాలన్న ముఖ్యమంత్రి కాంగ్రెస్ ప్రభుత్వం గతం లో నిర్వహించిన విధంగా ఆఫ్ లైన్ లో పారదర్శకంగా బదిలీలు,పదోన్నతులు నిర్వహించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు..

# యుద్ధావిధిగా గ్రూప్ 2

హైదరాబాద్, జూన్ 6: తెలంగాణలో గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష ముందుగా ప్రకటించిన షెడ్యూలు ప్రకారమే జరుగనుంది. గ్రూప్-1 పరీక్ష వాయిదా వేయడానికి హైకోర్టు నిరాకరించింది. పరీక్ష నిర్వహణకు పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తిచేసిందని, ఈ సమయంలో పరీక్ష వాయిదాపై నిర్ణయం తీసుకోలేమని స్పష్టంచేసింది. పిటిషనర్లు ఇచ్చిన వినతిపత్రాన్ని పరిశీలించి, దీనిపై టీజీపీఎస్సీ తుది నిర్ణయం తీసుకోవాలని ఆదేశిస్తూ పిటిషన్‌పై విచారణను ముగించింది. రాష్ట్రంలో జూన్ 9న నిర్వహించనున్న గ్రూప్-1 పరీక్షను వాయిదావేయాలంటూ ఎం.గణేశ్, భూక్యా భరత్‌లు జూన్ 1న హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. జూన్ 9న ఇంటెలిజెన్స్ బ్యూరోలో అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ గ్రేడ్-1, ఎగ్జిక్యూటివ్ పోస్టులకు స్క్రీనింగ్ పరీక్ష ఉండటంతో.. గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షను వాయిదావేయాలని పిటిషన్‌లో కోరారు. దీనిపై జూన్ 4న జస్టిస్ పుల్లా కార్తీక్ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా పబ్లిక్ సర్వీస్ కమిషన్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. తెలంగాణలో కేవలం 2 ఇంటెలిజెన్స్ పోస్టులకు 700 మంది అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకున్నారని, అదే గ్రూప్-1 పోస్టులకు 4 లక్షలకు పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. కేవలం కొంత మంది ప్రయోజనాల కోసం.. లక్షల మంది భవిష్యత్తును పణంగా పెట్టడం సరికాదన్నారు. కమిషన్ న్యాయవాది వాదనలతో న్యాయమూర్తి ఏకీభవించారు. దీంతో ప్రిలిమ్స్ పరీక్ష వాయిదా వేయడానికి నిరాకరిస్తూ.. దీనిపై కమిషన్ తుది నిర్ణయం తీసుకోవాలని ఆదేశిస్తూ.. కేసు విచారణను ముగించింది.

తెలంగాణలో జూన్ 9న నిర్వహించనున్న గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష హాల్‌టికెట్లను టీజీపీఎస్సీ జూన్ 1న విడుదల చేసిన సంగతి తెలిసిందే. అధికారిక వెబ్‌సైట్‌లో ప్రిలిమ్స్ పరీక్ష హాల్‌టికెట్లను అందుబాటులో ఉంచింది. అభ్యర్థులు తమ టీఎస్‌పీఎస్సీ ఐడీ, పుట్టినతేదీ వివరాలు నమోదచేసి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ప్రకటించిన షెడ్యూలు ప్రకారం.. జూన్ 9న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గ్రూప్-1 స్క్రీనింగ్ టెస్ట్ (ప్రిలిమినరీ పరీక్ష) నిర్వహించనున్నారు. అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్ మీద ఫొటో సరిగా లేకుంటే, అభ్యర్థి గెజిటెడ్ అధికారి లేదా విద్యార్థి గతంలో చదువుకున్న విద్యాసంస్థ ప్రిన్సిపల్ అటెస్ట్ చేసిన మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలతోపాటు కమిషన్ వెబ్‌సైట్లో పొందుపరిచిన ధ్రువీకరణ పత్రాన్ని పూర్తిచేసి ఇన్విజిలేటర్‌కు ఇవ్వాల్సి ఉంటుంది. అలా అయితేనే పరీక్షకు అనుమతిస్తారు.

**అభ్యర్థులకు అలర్ట్..**

రాష్ట్రంలో 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి 4.03 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారు. గత అనుభవాల నేపథ్యంలో గ్రూప్-1 ప్రిలిమ్స్ నిర్వహణకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అన్ని జాగ్రత్తలు తీసుకుంటుంది. ఈ మేరకు అభ్యర్థులకు కఠిన నిబంధనలు విధించింది. అభ్యర్థుల సౌకర్యం కోసం పరీక్షకు సంబంధించిన నియమ నిబంధనలు, ఓఎంఆర్ షీట్ నమూనాపత్రాలను కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది.

**పరీక్ష విధానం..**

మొత్తం 150 మార్కులకు గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించనున్నారు. జనరల్ స్టడీస్ ఒ మెంటల్ ఎబిలిటీ నుంచి మొత్తం 150 ప్రశ్నలు అడుగుతారు. ఆబ్జెక్టివ్ విధానంలో ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష సమయం రెండున్నర గంటలు (150 నిమిషాలు). ప్రిలిమ్స్ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులలో నిర్ణీత నిష్పత్తిలో మెయిన్ పరీక్షకు ఎంపికచేస్తారు.

**పరీక్ష కేంద్రాలు..**

ఆసిఫాబాద్-కొమ్రంభీమ్, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, సిరిసిల్ల-రాజన్న, సిద్ధిపేట, మెదక్, కామారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, సూర్యాపేట, నల్గొండ, భువనగిరి-యాదాద్రి, జనగాం, మేడ్చల్-మల్కాజ్‌గిరి, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగులాంబ-గద్వాల్, వనపర్తి, నాగర్‌కర్నూల్.

# కారు బోల్తా నలుగురికి గాయాలు

వికారాబాద్: తాండూర్ పట్టణంలోని నడి రోడ్డు లో అతి వేగం తో అదుపు తప్పి కారు బోల్తా పడింది. నేషనల్ హైవే 167 రోడ్డు నిర్మాణ కాలువలో కారు దూసుకెళ్లింది. ఆ సమయంలో నలుగురు యువకులు కారులో ప్రయాణిస్తున్నారు. వారిని తాండూర్ పట్టణం దుబాయ్ రెడీ మెడ్ షాప్ కి చెందిన సర్దార్,సల్మాన్, జుబేర్, హైమద్ వ్యక్తులు గా పోలీసులు గుర్తించారు. వారిలో ఒకరి పరిస్థితి విషమం గా వుండడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు.

# గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు సూచనలు తప్పనిసరిగా పాటించాలి

**జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా**



జగిత్యాల: గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఈ క్రింద తెలిపిన సూచనలు తప్పనిసరిగా పాటించవలసి ఉంటుందని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్-ఎ సేవల దరఖాస్తుదారులకు నోటిఫికేషన్ నెం.02/2024 ద్వారా వోఎంఆర్ విధానంలో ప్రిలిమినరీ టెస్ట్ (ఆబ్జెక్టివ్ టైప్) 09/06/2024న ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు నిర్వహించబడుతుందని తెలియజేయడం. అభ్యర్థులను ఉదయం 9:00 గంటల నుంచి పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు. పరీక్షా కేంద్రం గేట్ ఉదయం 10:00 గంటలకు మూసివేయబడుతుంది మరియు ఉదయం 10:00 గంటల తర్వాత అభ్యర్థులెవరూ పరీక్షా కేంద్రంలోకి ప్రవేశించడానికి అనుమతించబడరని అభ్యర్థులు 01/06/2024 మధ్యాహ్నం 02:00 గంటల నుండి కమిషన్ వెబ్‌సైట్ నుండి పరీక్ష ప్రారంభమయ్యే వరకు హాల్ టిక్కెట్‌లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని అన్నారు. అభ్యర్థులు కాలిక్యులేటర్లు, పేజర్లు, సెల్ ఫోన్లు, టాబ్లెట్‌లు, పెన్ డ్రైవ్‌లు, బ్లూటూత్ పరికరాలు, వాచ్, మ్యాథమేటికల్ టేబుల్‌లు, లాగ్ బుక్‌లు, లాగ్ టేబుల్‌లు, వాలెట్, హ్యాండ్‌బ్యాగులు, జోలాలు, పౌచ్‌లు, రైటింగ్ ప్యాడ్‌లు, నోట్స్, చార్ట్‌లు, లూజ్ షీట్‌లు, వంటివి తీసుకురాకూడదు. ఆభరణాలు లేదా ఏదైనా ఇతర గాడ్జెట్‌లు/ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లు లేదా రికార్డింగ్ సాధనాలు వారి శరీరం లేదా పాకెట్‌లపై కట్టబడి ఉంటాయి. దానిని కలిగి ఉండటం వలన పరీక్ష/పరీక్షల అభ్యర్థిత్వం చెల్లుబాటు కాకుండా పోతుంది. అభ్యర్థులు బూట్లు ధరించకుండా చప్పల్ మాత్రమే ధరించాలని సూచించారు.

అభ్యర్థులు పరీక్ష సమయం పూర్తయ్యే వరకు పరీక్ష హాలు నుండి బయటకు రావద్దని సమాచారం. పరీక్ష హాలు నుండి బయలుదేరే ముందు, అభ్యర్థి వోఎంఆర్ జవాబు పత్రాన్ని ఇన్విజిలేటర్‌కు అందజేయాలని సూచించారు. అభ్యర్థులకు కేటాయించిన పరీక్ష హాల్‌లో బయోమెట్రిక్ ఇన్విజిలేటర్‌ల ద్వారా అభ్యర్థుల బయోమెట్రిక్‌లను క్యాప్చర్ చేయడం ఉదయం 09.30 గంటలకు ప్రారంభమవుతుందని మరియు బయోమెట్రిక్ ఇన్విజిలేటర్ ద్వారా తన బయోమెట్రిక్‌లను క్యాప్చర్ చేసే వరకు అభ్యర్థులెవరూ పరీక్ష హాల్ నుండి బయటకు వెళ్లకూడదని అభ్యర్థులకు తెలియజేయబడింది. ఎవరైనా అభ్యర్థి తన బయోమెట్రిక్‌లను ఇవ్వకపోతే, అతని/ఆమె వోఎంఆర్ జవాబు పత్రం మూల్యాంకనం చేయబడదు. అభ్యర్థులు తమ వేళ్లపై బయోమెట్రిక్‌ల రికార్డింగ్‌కు ఆటంకం కలిగించే మెహెందీ, తాత్కాలిక టాటూలు లేదా ఏదైనా అబ్స్ట్రక్టివ్ మెటీరియల్-కవర్‌లను కలిగి ఉండకూడదని సూచించారు. అభ్యర్థుల విలువైన వస్తువులు లేదా వస్తువులను భద్రపరచడానికి కమిషన్ ఎలాంటి క్లోక్ రూమ్/స్టోరేజీ సౌకర్యాన్ని అందించదని అభ్యర్థి గమనించాలి. అభ్యర్థుల సౌలభ్యం కోసం, సమయాన్ని అంచనా వేయడానికి ప్రతి అరగంట పూర్తయిన తర్వాత హెచ్చరిక బెల్ మోగించబడుతుందని సమాచారం. అభ్యర్థులు పరీక్ష హాల్ ఇన్విజిలేటర్ నుండి సమయాన్ని కూడా తెలుసుకోవచ్చునని అన్నారు. అభ్యర్థులు లొకేషన్‌ను నిర్ధారించుకోవడానికి మరియు చివరి నిమిషంలో గందరగోళాన్ని నివారించడానికి పరీక్షకు కనీసం ఒక రోజు ముందు పరీక్షా కేంద్రాన్ని సందర్శించాలని సూచించడం ముఖ్యం.

అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యే ముందు కమిషన్ వెబ్ సైట్ లో అందుబాటులో ఉన్న హాల్ టికెట్ మరియు వోఎంఆర్ ఆన్సర్ షీట్ లోని సూచనలకు చదవాలని సూచించారు. తద్వారా వారి అభ్యర్థిత్వం తిరస్కరణ/ చెల్లుబాటు కాకుండా ఉంటుందని కలెక్టర్ తెలిపారు..

# యూపీ ఎన్నికలపై బీజేపీ పోస్టుమార్టమ్

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో భారతీయ జనతా పార్టీ ఘోర పరాజయాన్ని చవిచూసింది. లోక్‌సభ ఎన్నికల్లో అనేక ప్రధాన స్థానాల్లో ఓడిపోయింది. వాటిలో ఫైజాబాద్ సీటు ఒకటి. అయోధ్య నగరం ఫైజాబాద్ నియోజక వర్గం పరిధిలోనే ఉండటం విశేషం. ఇక్కడ రాంలాలా ప్రాణ ప్రతిష్ఠ జరిగి, రామ మందిరాన్ని నిర్మించిన తర్వాత, ఈ సీటు బీజేపీకి అత్యంత సులభం అని అందరూ భావించారు. కానీ తాజా ఫలితాలు కాషాయ దళాన్ని షాక్‌కు గురి చేశాయిరాంలాలా ప్రాణ ప్రతిష్ఠ జరిగిన అయోధ్య ప్రాంతంలో కాషాయం పార్టీకి చేదు అనుభవం ఎదురైంది. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలుపించుకోవడంలో ముఖ్యనేతలు విఫలమయ్యారు. ఎస్పీ అభ్యర్థి అవధేష్ ప్రసాద్ 54,567 ఓట్లతో గెలుపొందారు. ఆయనకు మొత్తం 5,54,289 ఓట్లు వచ్చాయి. ఇక్కడ నుంచి పోటీ చేసిన బీజేపీ లల్లూ సింగ్‌కు 4,99,722 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఈసారి అఖిలేష్ యాదవ్ అయోధ్య ఆలయం ఉన్న నియోజకవర్గంపై కొత్త ప్రయోగం చేశారు. అది జనరల్ సీటు అయినప్పటికీ, అయోధ్యలో అత్యధిక దళిత జనాభా ఉన్న పాసి కమ్యూనిటీకి చెందిన అభ్యర్థిని బరిలోకి దింపారు. అవధేష్ పాసి ఆరుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా, సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపక సభ్యులలో ఒకరుగా ఉన్నారు. సంఖ్యాపరంగా అయోధ్యలో పాసి కమ్యూనిటీ అతిపెద్ద కులంగా ఉందిఇక్కడ లల్లూ సింగ్‌కు మూడోసారి అవకాశం ఇచ్చింది. ఆయన వరుసగా రెండు సార్లు ఇక్కడ ఎంపీగా ఉన్నారు. రాజ్యాంగాన్ని మార్చే అంశాన్ని మొత్తం ప్రతిపక్షాలకు అప్పగించింది ఇదే లల్లూ సింగ్. రాజ్యాంగాన్ని మార్చాల్సిన అవసరం ఉన్నందున మోదీ ప్రభుత్వానికి 400 సీట్లు అవసరమని లల్లూ సింగ్ స్వయంగా చెప్పారు. దీంతో ఆయన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా రాజకీయ దుమారానికి కారణమయ్యాయి. అలాగే అపధేష్ పాసిదే అయోధ్య అనే నినాదం ముందు బీజేపీ కా మందిర్ కా ప్రతాప్, బ్రాండ్ మోదీ మాయాజాలం ఏమాత్రం పని చేయలేదు. రామమందిర శంకుస్థాపన తర్వాత దేశవ్యాప్తంగా హిందుత్వ పేరుతో ఓట్లు రాబట్టేందుకు ప్రయత్నించింది కాషాయదళం. కానీ బీజేపీ ప్రయోగం అయోధ్యలో మాత్రమే ఫలించలేదు.రామ మందిరాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిష్ఠ చేశారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ కలిసి లక్షలాది మందిని ఆలయాన్ని సందర్శించేలా చేశాయి. ప్రధాని మోదీ అయోధ్యలో రోడ్ షో నిర్వహించారు. మీరా మాంఝీ అనే దళిత మహిళ ఇంటికి వెళ్ళడం పెద్ద రాజకీయ సందేశంగా పరిగణించారు. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ కూడా ఇక్కడ రెండు సార్లు ఎన్నికల ర్యాలీలు నిర్వహించారు. అయితే రామ భక్తుల పార్టీ అయిన బీజేపీ మాత్రం రామ్‌లాలా జన్మస్థలం ఎన్నికల్లో ఓడిపోయింది. సమాజ్‌వాదీ పార్టీ, బీఎస్పీ పొత్తు పెట్టుకుంది. బీజేపీ అభ్యర్థి లల్లూ సింగ్ 65 వేల ఓట్లతో విజయం సాధించారు. ఈసారి 54 వేల ఓట్ల తేడాతో సమాజ్‌వాదీ పార్టీ చేతిలో ఓడిపోయారు. ఫైజాబాద్‌లో బీజేపీ ఓటమి అతి పెద్ద ఓటమి. గత కొన్ని దశాబ్దాలుగా బీజేపీకి రామమందిరం సమస్యగా ఉంది. పార్టీ ప్రతి ఎన్నికల మేనిఫెస్టోలోనూ ఇదే ప్రస్తావన ఉంది. కానీ రామమందిరం కట్టాక పార్టీ ఓడిపోయింది. ఫైజాబాద్‌లో అఖిలేష్ యాదవ్ పెద్ద ప్రయోగమే చేశారు. సాధారణ లోక్‌సభ స్థానంలో దళిత అభ్యర్థిని నిలబెట్టాడు. మీరట్‌లో కూడా ఇదే ప్రయోగమే చేశాడు. కానీ రామాయణం సీరియల్ రామ్ అరుణ్ గోవిల్ అంటే ఎన్నికల్లో గెలిచాడు. అయితే లల్లూ సింగ్ మాత్రం ఫైజాబాద్‌లో ఓడిపోయారుఅవధేష్ ప్రసాద్‌కు టికెట్ ఇవ్వడంతో ఆయనకు అనుకూలమైన సోషల్ ప్రచారం చేశారు. పొరుగున ఉన్న అన్ని స్థానాల్లో వివిధ కులాల నేతలకే టిక్కెట్లు ఇచ్చారు. కుర్మీ సామాజికవర్గానికి చెందిన లాల్చి వర్మ అంబేద్కర్ నగర్ నుంచి పోటీ చేయగా, నిషాద్ వర్గానికి చెందిన నేత సుల్తాన్‌పూర్ నుంచి టికెట్ దక్కించుకున్నారు. కాగా ఫైజాబాద్ పక్కనే ఉన్న స్థానాల్లో బీజేపీ ఠాకూర్, బ్రాహ్మణ నేతలను అభ్యర్థులుగా నిలబెట్టింది. సమాజ్‌వాదీ పార్టీకి ఇప్పటికే ముస్లిం, యాదవుల ఓట్లు ఉన్నాయి. వీటికి కుర్మీ-పటేల్, నిషాద్, దళితుల ఓట్లు కూడా తోడయ్యాయి. రాజ్యాంగం, రిజర్వేషన్ల పరిరక్షణ పేరుతో, మాయావతికి మద్దతు ఇస్తున్న జాతవ్ ఓటర్లు కూడా సమాజ్ వాదీ పార్టీకి మద్దతు ఇచ్చారు. బీఎస్పీతో పోరాడలేమని భావించిన ఆయన బీజేపీని ఓడించేందుకు సమాజ్ వాదీ పార్టీకి మిత్రపక్షంగా మారారు. ఫైజాబాద్‌లో దళితులు 26 శాతం, ముస్లింలు 14 శాతం, కుర్మీలు 12 శాతం, బ్రాహ్మణులు 12 శాతం, యాదవులు కూడా 12 శాతం ఉన్నారు. బీజేపీ అభ్యర్థి లల్లూ సింగ్ ఠాకూర్ వర్గానికి చెందినవారు. 2014, 2019 సంవత్సరాల్లో ఆయన ఇక్కడి నుంచి ఎంపీగా కూడా ఉన్నారు. అయితే ఈసారి చాలా వ్యతిరేకత వచ్చింది. అభ్యర్థిని మార్చాలని పార్టీ వర్గాలు డిమాండ్ చేశాయి. కానీ అది జరగలేదు. అయోధ్యలో ఆలయ నిర్మాణం తర్వాత చాలా అభివృద్ధి పనులు జరిగాయి. అయితే భూసేకరణపై స్థానిక ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. స్థానిక సామాజిక సమీకరణాలు, బీజేపీ అభ్యర్థి వ్యతిరేకత రామ్ లల్లా ఇంట్లో సమాజ్ వాదీ పార్టీ జెండాను ఎగురవేసింది

# అయ్యో మాధవిలతా..ఎంత పనాయే

హైదరాబాద్: మాధవిలత. హైదరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి. ఆమె బీజేపీలోనే కాదు రాష్ట్ర రాజకీయాల్లోనూ హాట్ టాఫిక్. ఎవరైనా ఒక పార్టీలో చేరిన తర్వాత టికెట్టు పొందుతారు. ఆమె మాత్రం పార్టీలో చేరకముందే బీజేపీ టికెట్టు దక్కించుకున్నారు. ఆ తర్వాతనే కాషాయ కండువా కప్పుకున్నారు. బీజేపీ జాతీయ నాయకత్వం అయితే పాతబస్తీలో ఎంఐఎంపై ఎక్కుపెట్టిన బాణం అన్నట్టుగా ఆమె పేరును ప్రచారంలో పెట్టింది. ప్రచార సమయంలోనూ ఎంఐఎంపైకి బాణం ఎక్కుపెడుతున్నట్టు ఫోజులిచ్చిన మాధవీలత మీడియాలో చర్చనీయాంశంగా మారారు. పొలిటికల్ జోకర్‌గా ప్రాచుర్యం పొందారు. తన ప్రసంగాల్లోనూ ఎంఐఎంపై విమర్శనాస్త్రాలు తీవ్రస్థాయిలో ఎక్కుపెట్టారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచార పర్వంలో ఓవరాక్షన్‌తో అందర్నీ విస్మయపరిచారు. ఆమె ఆర్భాటాలు, ప్రచార హడావిడి సోషల్‌మీడియాలో విస్తృతంగా ప్రచారమయ్యాయి. యూట్యూబ్‌ఛానళ్లు ఆమె వెంట పరుగులు పెడుతూ తెగ హడావిడి చేస్తూ హైదరాబాద్‌లో గెలువబోతున్నట్టు పబ్లిసిటీ ఇచ్చేయి. ఆ దెబ్బకు జరగరాని నష్టం ఏమైనా జరిగితే ఇబ్బంది అని ఎంఐఎం పార్టీ కూడా అప్రమత్తమైంది. పోలింగ్ శాతం పెరిగేలా జాగ్రత్తపడింది. ఎన్నికల రోజు పోలింగ్ కేంద్రాల్లో ముస్లిం మహిళలు ధరించే హిజాబ్‌ను మాధవిలత తొలగించి



చూడటం వివాదాస్పదమైన విషయం విదితమే. ఎన్నికలు అయిపోయాయి. ఆ తర్వాత ఆమె సైలెంట్ అయిపోయారు. మంగళవారం ఫలితాలు వెలువడ్డాయి. మళ్లీ హైదరాబాద్ పార్లమెంట్ స్థానంలో ఎంఐఎం అభ్యర్థి అసదుద్దీన్ ఓవైసీనే ఘన విజయం సాధించారు. ద్వితీయ స్థానంలో నిలిచారనే పేరేగానీ కనీసం ఓవైసీకి ఆమె పోటీకూడా ఇవ్వలేకపోయారు. ఓవైసీకి 2014లో 2,02,454, 2019లో 2,82,187 ఓట్ల మెజార్టీ వస్తే తాజా ఫలితాల్లో అది కాస్తా 3,38,087 ఓట్లకు పెరగడం గమనార్హం.

# మహిళలు మౌనం వీడి ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయండి..

**ర్యాగింగ్ ఇవిటీజింగ్ ఏదైనా అవమానానికి గురి అయినట్లయితే వెంటనే జిల్లా షీటీమ్ వాట్సాప్ నెంబర్ 8712667434 కాల్ చేయాలి.!**

**మౌనం వీడితే మహిళా గెలిచినట్లే మౌనంగా ఉండి కష్టాలు కోరి తెచ్చుకోవద్దు..**

**సైబర్ నేరాల పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలి..**

**పోలీస్ కమిషనర్ బి, అనురాధ**



సిద్దిపేట: సిద్దిపేట జిల్లాలోని షీటీమ్స్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్స్ అధికారులు సిబ్బంది మే నెలలో 5. 2024 వివిధ ప్రదేశాలలో కాలేజీలలో నిర్వహించిన అవేర్నెస్ కార్యక్రమాల వివరాలు..

సిద్దిపేట జిల్లాలో షీటీమ్స్ తో మహిళలకు, బాలికలకు భద్రత, భరోసాజిల్లాలోని హాట్స్పాట్ వద్ద షీటీమ్స్ తో నిరంతరం నిఘా, ఈవెటీజర్స్ 108 మందిని పట్టుకొని కౌన్సెలింగ్ నిర్వహించడం జరిగింది 108 ఈ పెట్టి కేసులు, నమోదు చేయడం జరిగింది.

హాట్స్పాట్ 32షీటీమ్స్ బృందాలు హాట్స్పాట్ 324 సార్లు సందర్శించడం జరిగింది.షీ టీమ్స్ 11 వివిధ ప్రదేశాలలో కాలేజీలలో అవేర్నెస్ కల్పించడం జరిగింది. సిద్దిపేట జిల్లాలో సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్, డివిజన్లవారీగా షీటీమ్స్ పనిచేయడం జరుగుతుంది. సిద్దిపేట జిల్లాలో ఉన్న షీ టీమ్స్ బృందాలు ప్రభుత్వ కళాశాలలో, ప్రభుత్వ పాఠశాలల్లో, తెలంగాణ మోడల్ స్కూళ్లలో, రెసిడెన్షియల్ స్కూల్ లలో కేజీబీవీ స్కూళ్లలో విద్యార్థిని విద్యార్థులకు ర్యాగింగ్, ఇవిటీజింగ్, పోక్సో,షీ టీమ్స్, యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్ సైబర్ నేరాలపై అవగాహన కల్పించడం జరుగుతుంది. మహిళా పోలీస్ స్టేషన్, స్నేహిత మహిళా కౌన్సిలింగ్ సెంటర్, భరోసా సెంటర్, కు కౌన్సిలింగ్ గురించి వచ్చే మహిళల ఉపాధి లేనివారికి ఉపాధి కలిగించడం గురించి పోలీస్ కమిషనర్ ఆసక్తిగల 48 మంది మహిళలకు సిద్దిపేట పట్టణం కోటిలింగాల టెంపుల్ ఆవరణలో ఉన్న ఆంధ్ర బ్యాంక్ వారి యొక్క సహకారంతో నిర్వహిస్తున్న శిక్షణా కేంద్రంలో ఎంబ్రాయిడింగ్, టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్ తదితర వాటిపై శిక్షణ ఇప్పించడం జరుగుతుంది.

పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ మహిళలు బాలికల రక్షణ గురించి తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేకంగా షీటీమ్స్ ఏర్పాటు చేయడం జరిగింది. మహిళల, బాలబాలికల, విద్యార్థిని, విద్యార్థులకు, రక్షణగా నిలుస్తూ సేవలు అందించడం జరుగుతుంది, ఏదైనా ఫోన్ వస్తే వెంటనే సంఘటన స్థలానికి చేయుచున్నారు, గుర్తించిన హాట్స్పాట్ వద్ద మరింత నిఘా ఉంచడం జరుగుతుంది. హాట్స్పాట్స్ ప్రదేశాలలో సీసీ కెమెరాలు పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షించాలని, పనిచేయకపోతే వెంటనే సంబంధిత పోలీస్ అధికారులకు రిపేర్ చేయాలని సూచించడం జరుగుతుంది. తెలంగాణ రాష్ట్రంలో షీ టీమ్స్ ప్రత్యేక గుర్తింపు పొందిందని తెలిపారు. మహిళలు బాలికలు విద్యార్థినిలు షీటీమ్స్ సేవలు వినియోగించుకోవాలని సూచించారు. ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలు అందిస్తామని తెలిపారు. మహిళలు అత్యవసర పరిస్థితుల్లో డయల్-100 కు కాల్ చేసి తక్షణ పోలీస్ సహాయం పొందాలని సూచించారు. ఎవరైనా వేధించిన రోడ్డుపై వెళ్లేటప్పుడు అవహేలనగా మాట్లాడిన ఉద్దేశపూర్వకంగా వెంబడించిన వెంటనే 100 లేదా షీటీమ్ వాట్సప్ నెంబర్ 8712667434. సిద్దిపేట పోలీస్ కంట్రోల్ రూమ్ 8712667100 ఫోన్ చేయాలని సూచించారు. ఫోక్సో, లైంగిక వేధింపుల గురైన మహిళలకు బాలికలకు భరోసానిస్తున్న భరోసా సెంటర్ మహిళలకు అండగా స్నేహిత మహిళా సపోర్ట్ సెంటర్ సేవలు. లైంగిక దాడులకు గురైన బాధితులకు భరోసా కల్పిండంతో పాటు, వారికి భరోసా కేంద్రం, స్నేహిత మహిళా సపోర్ట్ సెంటర్ పూర్తి సహయ సహకారాలను అందిస్తుంది.

ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ మాట్లాడుతు బాధితుల్లో భరోసాను కలిగిస్తున్న సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ భరోసా కేంద్రం, లైంగిక దాడులకు గురైన బాధితులకు భరోసా కల్పిండంతో పాటు వారికి పూర్తి సహయ సహకారాలను అందిస్తుంది తెలిపారు, భరోసా సెంటర్ ద్వారా సత్వర సేవలు అందించడం జరుగుతుందన్నారు. మరియు జిల్లాలో ఎక్కడైనా పోక్సో మరియు అత్యాచారం కేసులు జరగగానే సంబంధిత బాధితులను నేరుగా భరోసా సెంటర్ కు సంబంధిత అధికారులు తీసుకొని రాగానే చట్ట ప్రకారం వారికి అందించవలసిన సేవలు అందించడం జరుగుతుందన్నారు. భరోసా సెంటర్ సేవల గురించి సంబంధిత బాధితులు భరోసా సెంటర్ నెంబర్ 08457-293098, డయల్ 100, నెంబర్ కు ఫోన్ చేసి సహాయ సహకారాలు పొందవచ్చని సూచించారు. భరోసా కేంద్రంలో మహిళలకు పిల్లలకు భరోసా ఇచ్చిన కేసుల వివరాలు ఫోక్సో కేసులు 196 ,రేప్ కేసులు 45,మిస్సింగ్ కేసులు 09.మొత్తం 186 మంది బాధితులకు భరోసా కల్పించడం జరిగింది. భరోసా సెంటర్ సిబ్బంది 86 మంది బాధితుల ఇండ్లను సందర్శించడం జరిగింది,22 మందిని రియాబిటేషన్ సెంటర్ కు పంపించడం జరిగింది. గ్రామాలలో పట్టణాలలో భరోసా సెంటర్ అందిస్తున్న సేవల గురించి 90 అవేర్నెస్ కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. భరోసా సెంటర్ ఫండ్ నుండి బాధితులకు 96,300 ఆర్థిక సాయం అందించడం జరిగింది. 2015 ఈరోజు వరకు బాధితులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుండి 254 మంది మహిళలకు 87,27,500 ఆర్థిక సాయం అందించడం జరిగింది. ప్రాసిక్యూషన్ సమయంలో కూడా బాధితులకు న్యాయపరమైన సలహాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. స్నేహిత మహిళా సపోర్ట్ సెంటర్లో, గృహహింసకు వివిధ వేధింపులకు గురి అవుతున్న మహిళలు సంబంధించిన దరఖాస్తులు 996 .వాటిలో నుండి భార్యాభర్తలను మరియు కుటుంబ సభ్యులను పిలిపించి 967 కౌన్సెలింగ్ నిర్వహించడం జరిగింది. ఎవరైనా మహిళలు గృహహింసకు మరియు కట్నం తదితర అంశాల గురించి వేధింపులకు గురి చేస్తే వెంటనే స్నేహిత మహిళా సపోర్ట్ సెంటర్ 9494639498 నెంబర్ కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. మరియు స్నేహిత మహిళా సపోర్ట్ సెంటర్ సేవలు వినియోగించుకోవాలని మహిళలకు సూచించారు.

## ఛత్తీస్గఢ్ లో మావోయిస్టులకు ఎదురు దెబ్బ

బీజాపూర్: ఛత్తీస్గఢ్ లో మావోయిస్టులకు ఎదురు దెబ్బ తగిలింది. ఏరియా కమిటీ సభ్యుడితో పాటుగా 9 మంది మావోయిస్టులు అరెస్టు అయ్యారు. రెండు వేరు వేరు ఘటనలలో 9 మంది మావోయిస్టులు అరెస్టు అయ్యారు. ఫర్సెగఢ్ ఐఈడి పేలుడు ఘటనలో పాల్గొన్న ఐదుగురు మిలీషియా సభ్యులు అరెస్టు అయ్యారు. సోమనపల్లి ...బందెపారా రహదారిపై నిర్వహిస్తున్న వాహన తనిఖీల్లో నలుగురు మావోయిస్టులు దొరికిపోయారు. పట్టుబడ్డ వారి వద్ద భారీగా పేలుడు పదార్థాలు, మావోయిస్టు సాహిత్యం, కరపత్రాలు, బ్యానర్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిని విచారణ అనంతరం రిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరు పరిచారు.

## బిర్యానీలో బొద్దింక

ఖమ్మం: ఖమ్మం లకారం ట్యాంక్ బండ్ సమీపంలోని రాయల్ గ్రాండ్ రెస్టారెంట్ బిర్యానీలో బొద్దింక కలకలం రేపింది. రెస్టారెంట్ కు వెళ్లి బిర్యాని తింటున్న యువకులకు బొదింక ప్రత్యక్షం అయింది. సిబ్బంది కి చూపిస్తే మరోసారి తప్పుజరగ్గకుండా చూసుకుంటామని బ్రతిమిలారు. ఓపక్క ఫుడ్ సేఫ్టీ అధికారులు హోటల్స్ పై తనిఖీలు చేస్తూ కుళ్ళి పోయినా ఆహారపదార్థలను బయటపెడుతున్న తీరు మారని హోటల్స్ నిర్వహకుల వైనం. భోజన ప్రియుల ఆరోగ్యానికి హానికలిగిస్తున్న హోటల్స్‌పై తనిఖీ చేసి సీజ్ చేయాలంటూ నగరవాసులు డిమాండ్ చేస్తున్నారు.

## మైక్ మెకానిక్ షాపు లో అగ్ని ప్రమాదం

మేడ్చల్ మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బైక్ మెకానిక్ షాప్ లో గురువారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం సంభవించింది. స్థానికుల వివరాల ప్రకారం మేడ్చల్ పట్టణంలోని వివేకానంద విగ్రహం వద్ద అర్జున్ చౌహన్ బైక్ పాయింట్ లో అగ్నిప్రమాదం సంభవించింది. దీని గమనించిన స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ ఇంజన్ మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ అగ్ని ప్రమాదంలో దాదాపు 18 బైకుల వరకు దగ్ధమయ్యాయని షాప్ యజమాని తెలిపారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియ రాలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మేడ్చల్ పోలీసులు తెలిపారు

## ఓటమి పాలైన 15 మంది కేంద్ర మంత్రులు

న్యూఢిల్లీ, మోదీ మంత్రి వర్గంలో కీలక పదవుల్లో మంత్రులుగా కొనసాగిన స్మృతి ఇరానీ, అర్జున్ ముండా, అజయ్ మిశ్రా తేనీలు, రాజీవ్ చంద్రశేఖర్‌లతో సహా పలువురు ప్రముఖ నేతలు లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి పాలవడం తీవ్ర నిరాశకు గురిచేసింది.

లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోయిన కేంద్ర మంత్రులు వీరే..


- అమేథీ నుంచి పోటీ చేసిన కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ కాంగ్రెస్ నేత కిశోరీ లాల్ శర్మ చేతిలో 1,67,196 ఓట్ల తేడాతో ఓడిపోయారు. 2019లో ఇదే స్థానం నుంచి రాహుల్ గాంధీపై విజయం సాధించిన ఆమె ఈసారి అనూహ్య రీతిలో ఓడిపోయారు.
- జార్ఖండ్‌లోని ఖుంటి లోక్‌సభ స్థానం నుంచి పోటీచేసిన కాంగ్రెస్ అభ్యర్థి కాళీచరణ్ ముండా చేతిలో కేంద్ర గిరిజన వ్యవహారాలు, వ్యవసాయ శాఖ మంత్రి అర్జున్ ముండా 1,49,675 ఓట్ల తేడాతో ఓడిపోయారు.
- కేంద్ర హోంశాఖ సహాయమంత్రి అజయ్ మిశ్రా తేని లకింపూర్ ఖేరి ఘటన వివాదంలో పీకల్లోతు ఇరుక్కుపోయారు. ఇదే ఆయన్ని సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థి ఉత్కర్ష్ వర్మ చేతిలో ఆయన 34 వేల ఓట్ల తేడాతో ఓటమిపాలయ్యేలా చేసింది.
- వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ సహాయ మంత్రిగా చేసిన కైలాశ్ చౌదరీ రాజస్తాన్‌లోని బార్మర్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. అదే స్థానం నుంచి పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థి ఉమ్మెడ రామ్ బెనివాల్ చేతిలో 4.48 లక్షల ఓట్ల తేడాతో ఓడిపోయారు.
- కేంద్ర మంత్రి ఆర్కే సింగ్.. బీహార్‌లోని అర్రాలో సీపీఐఎంఎల్‌కు చెందిన సుదామ ప్రసాద్‌పై 59,808 ఓట్ల తేడాతో ఓడిపోయారు.
- కేరళలోని తిరువనంతపురం నుంచి పోటీ చేసిన ఎలక్ట్రానిక్స్, ఐటీశాఖ సహాయ మంత్రిగా పనిచేసిన రాజీవ్ చంద్రశేఖర్ కాంగ్రెస్ దిగ్గజ నేత శశిథరూర్ చేతిలో 16వేల ఓట్ల తేడాతో ఓడారు.
- కేంద్ర భారీ పరిశ్రమల మంత్రి మహేంద్ర నాథ్ పాండే .. యూపీలోని చండౌలీ స్థానం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు.
- హౌజింగ్, అర్బన్ అఫైర్స్ శాఖ మంత్రి కౌశల్ కిషోర్ మోహన్‌లాల్‌గంజ్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి సమాజ్‌వాదీ నేత ఆర్కే చౌదరి చేతిలో 70వేల ఓట్ల తేడాతో పోడిపోయారు.
- కన్స్యూమర్ అఫైర్స్, ఫుడ్, పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ శాఖ సహాయ మంత్రి సాధ్వీ నిరంజన్ జ్యోతి యూపీలోని ఫతేపుర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు.
- రైల్వేశాఖ సహాయ మంత్రి రావు సాహెబ్ దాన్వే .. మహారాష్ట్రలోని జాల్నా స్థానం నుంచి పోటీ చేసి ఓటమి చెందారు.
- కేంద్ర మంత్రి సంజీవ్ బాల్యన్.. ముజాఫర్‌నగర్ లోక్‌సభ సీటు నుంచి పోటీచేసి ప్రత్యర్థి ఎస్పీ నేత హరీంద్ర సింగ్ మాలిక్‌పై 24 వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు.
- విదేశాంగ శాఖ, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి వీ మురళీధరన్ కూడా ఓన్నికల్లో ఓడిపోయారు.
- ఫిషరీస్, యానియల్ హజ్‌బెండరీ, డెయిరీ శాఖ సహాయ మంత్రి ఎల్ మురుగన్.. డీఎంకే నేత ఏ రాజా చేతిలో 2 లక్షల ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు.
- హోంశాఖ సహాయ మంత్రి నిషిత్ ప్రామానిక్.. బెంగాల్‌లోని కూచ్ బిహార్ నుంచి పోటీచేసి టీఎంసీ నేత జగదీశ్ చంద్ర బాసునియా చేతిలో 39వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు.
- విద్యాశాఖ సహాయ మంత్రి సుభాష్ సర్కార్.. బంకురా లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీచేసి, టీఎంసీ నేత అరూప్ చక్రవర్తిపై 32 వేల ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యారు.

## 2018- 2024..7 శాతం నుంచి 21 శాతానికి ఓటింగ్ షేర్

హైదరాబాద్: తెలంగాణలో కదనోత్సాహంతో ఉంది కమలదళం. అధికారమే తరువాయి అంటూ ట్వంటీ ట్వంటీ ఎయిట్ టార్గెట్ పెట్టుకుంది. రాష్ట్రంలో ఎన్నిక ఎన్నికకీ ఓట్లు, సీట్లు పెంచుకుంటున్న బీజేపీ.. డబుల్ డిజిట్ కాకపోయినా గతకంటే డబుల్ ఎంపీ సీట్లలో విజయబావుటా ఎగురవేసింది. 8 ఎంపీ స్థానాలతో అధికార కాంగ్రెస్ పార్టీకి దీటైన పోటీ ఇచ్చింది. ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగాం.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికార పగ్గాలు చేపడతామన్న ధీమాతో వ్యూహాలకు పదునుపెడుతోంది కాషాయ పార్టీ.తెలంగాణలో లోక్‌సభ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీజేపీ అంచనాలకు తగ్గట్లే పర్‌ఫామ్ చేసింది. డబుల్ డిజిట్ సీట్లు టార్గెట్‌గా బరిలోకి దిగిన రాష్ట్ర నాయకత్వం ఆ మేజిక్ సాధించలేకపోయినా.. గతంకంటే రెట్టింపు సీట్లు గెలిచి రాష్ట్రంలో ప్రత్యామ్నాయశక్తిగా నిరూపించుకుంది. గతంలో ఒక అసెంబ్లీ స్థానంతో పాటు నాలుగు ఎంపీ సీట్లు గెలుచుకున్న బీజేపీ.. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో 8 అసెంబ్లీ స్థానాలతో పాటు.. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో అధికారపార్టీతో సరిసమానంగా 8 ఎంపీ సీట్లు గెలిచింది. దీంతో తాము కాంగ్రెస్‌కి ప్రత్యామ్నాయ శక్తిగా నిలిచామని, ఇక వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికార పగ్గాలు తమ చేతికొస్తాయన్న ధీమా బీజేపీలో కనిపిస్తోంది.పెరిగిన సీట్లతో పాటు ఓట్ల శాతం కమలం శ్రేణుల్లో జోష్ నింపింది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఆశించిన స్థాయిలో ఎమ్మెల్యే స్థానాలు దక్కకపోయినా..ఈ పార్లమెంట్ ఎన్నికల్లో పోరాటపటిమ చూపించి తెలంగాణలో బీజేపీ మరింత పట్టు సాధించింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి 7 శాతం ఓట్లొస్తే ఒకే ఒక్క ఎమ్మెల్యే గెలిచారు. ఏడాదితిరిగేలోపే 2019 లోక్‌సభ ఎన్నికల నాటికి 19 శాతం ఓటింగ్‌తో ఆ పార్టీ నుంచి ఏకంగా నలుగురు ఎంపీలు గెలిచారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో 14 శాతం ఓట్లు సాధించిన బీజేపీ నుంచి 8 మంది ఎమ్మెల్యేలు అసెంబ్లీలోకి అడుగుపెట్టారు. ఈ లోక్ సభ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ఓటింగ్ ఏకంగా 21 శాతానికి పెరిగింది. ఆ పార్టీనుంచి ఎనిమింది ఎంపీలు గెలిచారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం సాధించేందుకు ఇప్పటినుంచే ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని బీజేపీ నాయకత్వం ప్లాన్ చేస్తోంది.రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన గత బీఆర్ఎస్ పాలననే తలపిస్తోందని.. హామీల అమలులో ఇప్పటికే కాంగ్రెస్ వైఫల్యం చెందిందని ఆరోపిస్తున్నారు బీజేపీ నేతలు. హామీల అమలుకు నిధులు ఎక్కడి నుంచి తెస్తారో కూడా చెప్పలేని స్థితిలో కాంగ్రెస్ సర్కారు ఉందని కమలం నేతలు టార్గెట్ చేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల ఊపుతో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో లక్ష్యం సాధించే దిశగా కార్యాచరణ రూపొందించుకునేందుకు సిద్ధమవుతున్నారు. బీజేపీ అగ్ర నాయకత్వం కూడా దక్షిణాదిపై ఫోకస్ పెట్టడంతో.. కేంద్రంలో కొలువుదీరనున్న ఎన్డీయే సర్కారులో రాష్ట్ర బీజేపీ ఎంపీలకు రెండు మూడు కేంద్రమంత్రి పదవులు దక్కే అవకాశం కనిపిస్తోంది.గత బీఆర్ఎస్ పాలనను టార్గెట్ చేసి అసెంబ్లీ ఎన్నికల్లో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగాలనుకుంది బీజేపీ. షన్ రెడ్డి సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి రెండోసారి విజయం సాధించడమేకాకుండా.. మంచి స్ట్రాటజీతో.. పర్ఫెక్ట్ క్యాండిడేట్ సెలక్షన్‌తో మిగిలిన నియోజకవర్గాల్లోనూ సత్తా చూపించారు. మల్కాజ్‌గిరి, చేవెళ్ల, మెదక్, మహబూబ్‌నగర్ స్థానాలను కైవసం చేసుకోవడంలో కిషన్ కీలకపాత్ర పోషించారు. బూత్‌స్థాయి నుంచి కేడర్‌ను ఉత్తేజపరుస్తూ.. వారికి దిశానిర్ధేశం చేస్తూ ముందుకెళ్లారు కిషన్. పదేళ్ల క్రితం బీజేపీ పరిస్థితికి.. ఇప్పుడు ఆ పార్టీ పరిస్థితికి చాలా తేడా ఉంది. అప్పుడు అసెంబ్లీలోనే ఒక సీటు సాధించేందుకు తంటాలుపడ్డ కాషాయపార్టీ.. ఇప్పుడు గౌరవప్రద స్థానంలో నిలిచింది.. నరేంద్రమోదీని, అభివృద్ధిని చూసి మరోసారి పట్టం కట్టారంటూ కిషన్ రెడ్డి తెలిపారు. తొలిసారిగా తెలంగాణలో 8 స్థానాలు గెలిచి రికార్డు సాధించామన్నారు. డబుల్ డిజిట్ రావాలన్న ఆకాంక్షతో పనిచేశామని.. రెండు, మూడు స్థానాల్లో గెలివాల్సి ఉందని.. కానీ కొన్ని కారణాలతో ఓడిపోయామని తెలిపారు.అయితే ఆశించిన స్థాయిలో ఎమ్మెల్యేలు గెలవకలేపోయినా .. లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం గట్టి ప్రభావమే చూపింది. ఈ ఫలితాలతో రానున్న కాలం తమదేనని పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపుతోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి తెలంగాణ రాష్ట్రంలో బలమైన ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతామన్న నమ్మకంతో ఉంద బీజేపీ నాయకత్వం. అధికార పగ్గాలు చేపట్టి తెలంగాణ గడ్డపై కాషాయ జెండా ఎగరవేస్తామని ఇప్పటినుంచే ధీమా వ్యక్తంచేస్తున్నారు కమలనాథులు.

## నల్గొండలో సత్తా చాటిన కోమటి బ్రదర్స్

నల్గొండ, జూన్ 6: నల్గొండ లోక్ సభ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్ రెడ్డి ఘన విజయం నమోదు చేశారు. ఈయన సమీప ప్రత్యర్థి అయిన బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డిపై 559905 ఓట్ల భారీ మెజారిటీ సాధించారు. రఘువీర్ రెడ్డికి 784337 ఓట్లు పోలయ్యాయి. సైదిరెడ్డికి 224432 ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్ అభ్యర్థిగా ఉన్న కంచర్ల క్రిష్ణా రెడ్డికి 218417 ఓట్లు వచ్చాయి. దీంతో బీఆర్ఎస్ ఈ లోక్ సభ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ మూడో స్థానానికి పరిమితం అయింది. తెలంగాణలో ఎక్కడా బీఆర్ఎస్ పార్టీ ఆధిక్యంలో కనిపించకపోవడం ఆ పార్టీ శ్రేణులను నిరాశకు గురి చేసింది. మొత్తానికి తెలంగాణ లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎన్ పార్టీ ఒక్క సీటును కూడా గెలవలేకపోయింది.తెలంగాణ లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ, బీజేపీ జోరు విపరీతంగా ఉంది. ఎక్కడా బీఆర్ఎస్ పార్టీ ఏ ప్రభావం లేదు. నల్గొండ లోక్ సభ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ మంత్రి జానారెడ్డి కుమారుడు కుందూరు రఘురవీర్ రెడ్డి భారీ ఆధిక్యంలో కొనసాగారు. ఈయనకు ఉదయం 11 గంటల సమయానికి 738400 ఓట్లు రాగా.. బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి 525362 ఓట్ల తేడాతో వెనుకబడి ఉన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల క్రిష్ణా రెడ్డి 534796 ఓట్ల తేడాతో మూడో స్థానానికి పరిమితం అయ్యారు. తెలంగాణ లోక్ సభ ఎన్నికల కౌంటింగ్ లో బీఆర్ఎస్ పార్టీ దాదాపు మూడో స్థానంలోనే ఉంది. రెండో స్థానంలో బీజేపీ జహీరాబాద్ లోక్ సభ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ కుమార్ షెట్కార్ ఘన విజయం సాధించారు. ఈయన సమీప ప్రత్యర్థి అయిన బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ పై 46188 ఓట్ల స్వల్ప మెజారిటీ సాధించారు. సురేష్ కుమార్ షెట్కార్ కు 528418 ఓట్లు పోలయ్యాయి. బీబీ పాటిల్ కు 482230 ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్ అభ్యర్థిగా ఉన్న



గాలి అనిల్ కుమార్ కు 172078 ఓట్లు మాత్రం వచ్చాయి. దీంతో బీఆర్ఎస్ జహీరాబాద్ లోక్ సభ నియోజకవర్గంలో మూడో స్థానానికి పరిమితం అయింది. తెలంగాణలో ఎక్కడా బీఆర్ఎస్ పార్టీ ఆధిక్యంలో కనిపించకపోవడం ఆ పార్టీ శ్రేణులను నిరాశకు గురి చేసింది. మొత్తానికి తెలంగాణ లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఒక్క సీటును కూడా గెలవలేకపోయింది. తెలంగాణ లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ, బీజేపీ జోరుగా ఉన్నాయి. జహీరాబాద్ లోక్ సభ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ కుమార్ షెట్కార్ ముందంజలో మొదటి నుంచి దూసుకుపోయారు. ఉదయం 10.30 గంటల సమయానికి ఈయనకు 330138 ఓట్లు రాగా.. బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ 16228 ఓట్ల తేడాతో వెనుకబడి ఉన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ కుమార్ గాలి 213896 ఓట్ల తేడాతో మూడో స్థానానికి పరిమితం అయ్యారు. తెలంగాణలో ఎక్కడా బీఆర్ఎన్ పార్టీ ఆధిక్యంలో కనిపించకపోవడం లేదు. పైగా ప్రతి చోటా మూడో స్థానంలో ఉంటోంది.

## 40 ఏళ్ల తర్వాత మహిళకు పట్టం...

వరంగల్: చరిత్రాత్మక వరంగల్ పార్లమెంటు ఎంపీగా 4 దశాబ్దాల తర్వాత మహిళ పార్లమెంట్ లో అడుగుపెడుతోంది. 1984లో వరంగల్ పార్లమెంట్ స్థానం నుండి మహిళ ప్రాతినిథ్యం వహించింది. సుదీర్ఘకాలం తరువాత 2024 ఎన్నికల్లో వరంగల్ పార్లమెంటు స్థానం నుండి మరో మహిళకు చట్టసభలకు వెళ్లే అవకాశం వచ్చింది. మరో విశేషమేమిటంటే ఇద్దరూ డాక్టర్లే. ఆ మహిళా ఎంపీలే ఒకరు డాక్టర్ కల్పనా దేవి కాగా మరొకరు డాక్టర్ కడియం కావ్య. 1980 దశకంలో రాజకీయాల్లో మహిళలకు అంతంత ప్రాధాన్యత ఉన్న సమయంలో డాక్టర్ వృత్తిలో కొనసాగుతున్న కల్పన దేవి 1984లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా వరంగల్ పార్లమెంట్ స్థానం నుండి పోటీ చేసి విజయం సాధించింది. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయంగా తెలుగుదేశం పార్టీ రావడం జరిగింది. వరంగల్ పార్లమెంట్ స్థానం నుండి పోటీ చేసిన కల్పన దేవి సమీప కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కమాలుద్దీన్ హమ్మద్ పై 8 వేల 456 ఓట్ల తో విజయం సాధించింది. కొత్తగా వచ్చిన తెలుగు దేశం పార్టీ కి తోడు మహిళగా వరంగల్ జిల్లా రాజకీయాల్లో ఓ వెలుగు వెలిగింది. 1984లో కల్పన దేవి తరువాత ఎంపీ గా వరంగల్ పార్లమెంట్ స్థానం నుండి మహిళకు అవకాశం రాలేదు. 2024 లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో అనేక రాజకీయ పరిణామాల మధ్య కడియం కావ్య కాంగ్రెస్ పార్టీ నుండి వరంగల్ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీలో నిలబడింది. కావ్య అభ్యర్థిత్వం పై అనేక ఆరోపణలు, ప్రత్యర్థులు విమర్శలు తీవ్ర రాజకీయ చర్చకు దారితీసాయి. గెలుపే కష్టమనుకున్న సమయంలో 2 లక్షల 19 వేల 691 ఓట్ల మెజార్టీ తో రికార్డు సృష్టించింది. సమీప బీజేపీ అభ్యర్థి ఆరూరి రమేష్ పై విజయం సాధించింది. 40 సంవత్సరాల తరువాత రాణి రుద్రమ వారసురాలిగా పార్లమెంటులో అడుగుపెడుతుంది.కల్పన దేవి రాజకీయాల్లోకి రాకముందు. వరంగల్ నగరంలో ప్రైవేట్ నర్సింగ్ హోమ్ నిర్వహిస్తూ డాక్టర్ గా కొనసాగుతుంది. తెలుగు దేశం పార్టీ ఏర్పాటు తో రాజకీయాల్లో వచ్చిన కల్పన దేవి 1984 ఎన్నికై ఆ తరువాత కాంగ్రెస్ పార్టీ లో చేరి సుదీర్ఘ కాలం వరంగల్ జిల్లా రాజకీయాల్లో కొనసాగారు. 2౼24 లో గెలిచిన కడియం కావ్య సైతం డాక్టర్. వైద్య విద్యను పూర్తి చేసిన కావ్య ప్రభుత్వ వైద్యురాలిగా కొనసాగుతూ తండ్రి కడియం శ్రీహరి వారసురాలిగా రాజకీయాల్లోకి వచ్చారు. 1984 లో 2024 లో వరంగల్ పార్లమెంట్ సభ్యులుగా పార్లమెంట్ లో అడుగుపెట్టారు.

కల్పన దేవి తరువాత 2008 లో వరంగల్ పార్లమెంట్ కు జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరుపున కొండ సురేఖ పోటీ చేసే అవకాశం వచ్చినా విజయం సాధించలేదు.

# స్టోయినిస్ ఆల్‌రౌండ్ షో.. ఒమన్‌పై ఆసీస్ విక్టరీ



బ్రిడ్జ్‌టౌన్: టీ20 వరల్డ్‌కప్‌లో ఆస్ట్రేలియా తొలి విక్టరీ నమోదు చేసింది. ఒమన్‌తో జరిగిన మ్యాచ్‌లో 39 రన్స్ తేడాతో ఆసీస్ విజయం సాధించింది. బ్యాటర్ మార్కస్ స్టోయినిస్ హాఫ్ సెంచరీతో చెలరేగాడు. కెన్సింగ్టన్ ఓవర్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో స్టోయినిస్ 36 బంతుల్లో 67 రన్స్ చేశాడు. తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 5 వికెట్ల నష్టానికి 164 రన్స్ చేసింది. డేవిడ్ వార్నర్ 56 రన్స్ స్కోర్ చేశాడు. ఆస్ట్రేలియా మిడిల్ ఆర్డర్ వికెట్లను త్వరగా కోల్పోయింది. కానీ స్టోయినిస్ డేరింగ్ ఇన్నింగ్స్ ఆడాడు. స్టోయినిస్ ఇన్నింగ్స్‌లో ఆరు సిక్సర్లు, రెండు ఫోర్లు ఉన్నాయి. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఒమన్.. నిర్ణీత ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 125 రన్స్ చేసింది. స్టోయినిస్ మూడు వికెట్లు తీసుకోగా, జంపా, ఎలిస్, స్టార్క్‌లు చెరి రెండు వికెట్లు తీసుకున్నారు. ఈ విక్టరీతో గ్రూపు బిలో ఆస్ట్రేలియా రెండు పాయింట్లు, నెట్‌రన్‌రేట్‌తో టాప్‌లో ఉన్నది.

# ఆటగాళ్లను చంపేస్తారా? న్యూయార్క్ పిచ్‌లపై ఆగ్రహం



టీ 20 ప్రపంచకప్ 2024లో టీమిండియా-ఐర్లాండ్ మధ్య జరిగిన మ్యాచ్లో పిచ్ స్పందించిన తీరుపై మాజీలు విమర్శలు గుప్పిస్తున్నారు. న్యూయార్క్లోని నసావు కౌంటీ స్టేడియంలోని పిచ్పై ఇండియా-ఐర్లాండ్ తలపడగా భారత జట్టు ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్లో తొలుత బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్ 96 పరుగులు చేయగా... టీమిండియా కేవలం 12 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. అయితే ఈ పిచ్పై బ్యాటింగ్ చేసేందుకు ఇరు జట్లు బ్యాటర్లు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. పరుగులు చేసేందుకు తీవ్రంగా శ్రమించారు. ఐర్లాండ్ కనీసం వంద పరుగుల మార్కు కూడా దాటలేదు. దీంతో ఈ పిచ్పై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**ఐర్లాండ్ వల్ల కాలేదు..**

న్యూయార్క్లోని నసావు ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్లో టాస్ గెలిచిన టీమిండియా.. ఐర్లాండ్ను బ్యాటింగ్కు ఆహ్వానించింది. గత మ్యాచుల్లో ఈ పిచ్పై బౌలర్లు చెలరేగిపోవడంతో టాస్ గెలిచిన వెంటనే రోహిత్ శర్మ మరో ఆలోచన లేకుండా బౌలింగ్ ఎంచుకున్నాడు. రోహిత్ నిర్ణయం సరైందేనని కాసేపటికే ఐర్లాండ్కు అర్థమైంది. టీ 20 ప్రపంచకప్ తొలి మ్యాచ్లో భారత బౌలర్లు చెలరేగిపోయారు. బౌలింగ్కు అనుకూలిస్తున్న పిచ్పై నిప్పులు చెరిగారు. బౌలింగ్కు అనుకూలిస్తున్న పిచ్పై భారత బౌలర్లను ఎదుర్కోవడం ఐర్లాండ్ బ్యాటర్ల వల్ల కాలేదు. పదునైన బంతులతో చెలరేగిన టీమిండియా బౌలర్లు... పసికూన ఐర్లాండ్ బ్యాటర్లను వణికించారు. ఐర్లాండ్ను కేవలం 96 పరుగులకే కుప్పకూల్చారు. 16 ఓవర్లలోనే ఐర్లాండ్ బ్యాటింగ్ ముగిసింది. టీమిండియా బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి పరుగులు రాకుండా చేశారు. దీంతో ప్రతీ పరుగుకు ఐర్లాండ్ తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. దీంతో ఐర్లాండ్ భారత బౌలర్ల ధాటికి 16 ఓవర్లలో కేవలం 96 పరుగులకే కుప్పకూలింది. అనంతరం 97 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా 12.2 ఓవర్లలో కేవలం రెండే వికెట్లు కోల్పోయి సునాయసంగా లక్ష్యాన్ని ముద్దాడింది. రోహిత్ శర్మ అర్ధ శతకంతో చెలరేగగా... రిషభ్ పంత్ కీలక ఇన్నింగ్స్ ఆడాడు.

**మండిపడ్డ మాజీలు**

టీ 20 ప్రపంచకప్ లాంటి మెగా టోర్నీల్లో ఇలాంటి పిచ్ ఉపయోగించడంపై మాజీ క్రికెటర్లు భగ్గుమన్నారు. ఇది ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదని తేల్చి చెప్పారు. న్యూయార్క్లోని నసావు కౌంటీ స్టేడియంలో పిచ్ చాలా పేలవంగా ఉందని... పిచ్పై అస్థిరమైన బౌన్స్ కనిపించిందని మాజీలు అన్నారు. ఇలాంటి పిచ్పై బ్యాటింగ్ చేయడం ఆటగాళ్లకు పెద్ద సవాల్ అని విమర్శించారు. ప్రపంచకప్లాంటి పెద్ద టోర్నీల్లో ఇలాంటి నాసిరకం పిచ్ ఏర్పాటు చేయడంపై ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైఖేల్ వాన్ మండిపడ్డారు. అమెరికన్ ప్రేక్షకులను టెస్ట్ క్రికెట్కు అలవాటు చేయాలని ఇలాంటి పిచ్ తయారు చేసి ఉంటారని టీమిండియా మాజీ ఆటగాడు వసీం జాఫర్ ఎద్దేవా చేశాడు. న్యూయార్ పిచ్ ఒక మంత్రగత్తెలా ఉందని నవజ్యోత్ సిద్ధూ విమర్శించారు. ఇర్ఫాన్ పఠాన్ కూడా ఇలాంటి అభిప్రాయాన్నే వ్యక్తం చేశాడు.

# ఆస్ట్రేలియా పిచ్‌లపై అమెరికాలో ఆట!

**- టీ20 ప్రపంచకప్‌లో డ్రాప్ ఇన్ పిచ్‌ల వినియోగం**

**- ఆధునిక పిచ్‌లపై క్రికెటర్ల మిశ్రమ స్పందన**



ఆస్ట్రేలియా పిచ్‌లపై అమెరికాలో ఆట!. అవును మీరు చదివింది నిజమే. 2024 ఐసీసీ టీ20 ప్రపంచకప్‌కు ఆతిథ్యం ఇస్తున్న అమెరికా.. మెగా టోర్నీ ముంగిట న్యూయార్క్‌లో స్టేడియం నిర్మించింది. న్యూయార్క్ స్టేడియంలో క్యూరేటర్లు పిచ్‌ను తయారు చేయలేదు. ఆడిలైడ్‌లో తయారు చేసిన 'డ్రాప్ ఇన్' పిచ్‌లను తీసుకొచ్చి న్యూయార్క్ స్టేడియంలో అమర్చారు. ఈ తరహా పిచ్‌ల వినియోగంపై చర్చ నేపథ్యంలో డ్రాప్ ఇన్ పిచ్ గురించిన వివరాలు..

నవతెలంగాణ క్రీడావిభాగం

డ్రాప్ ఇన్ పిచ్ అంటే?

డ్రాప్ ఇన్ పిచ్ అర్థం పేరులోనే ఉంది. పిచ్‌లను తయారు చేసి అవసరమైన వేదికలకు పంపిస్తారు. భారీ క్రేన్ల సహాయంతో పిచ్‌ను మైదానంలో అమర్చుతారు. మ్యాచ్ లేదా టోర్నమెంట్ అనంతరం తిరిగి డ్రాప్ ఇన్ పిచ్‌లను తీసుకెళ్తారు. తాత్కాలిక ఏర్పాటు, అవసరం కోసం డ్రాప్ ఇన్ పిచ్‌లను వినియోగిస్తారు.

కృత్రిమ పిచ్‌లు అనొచ్చా?

డ్రాప్ ఇన్ పిచ్‌లు ఏమాత్రం కృత్రిమం కాదు. సహజసిద్ధంగా తయారు చేసిన పిచ్‌లతో సమానం. ఎర్ర, నల్ల మట్టి లేదా మిశ్రమంతో తయారు చేసిన పిచ్‌పై సహజమైన పచ్చికను పెంచుతారు. ఇది పూర్తిగా సహజసిద్ధమైనది.

ఎలా తయారు చేస్తారు?

సాధారణంగా డ్రాప్ ఇన్ పిచ్ కొలతలు 24 మీటర్ల పొడవు, 3 మీటర్ల వెడల్పు, 20 సెంటీమీటర్ల లోతు. తొలుత ఈ కొలతలతో స్టీల్ ఫ్రేమ్ రూపొందిస్తారు. అనంతరం మట్టితో పిచ్‌ను తయారు చేసి ఆపై లేయర్‌లో పచ్చికను పెంచుతారు. ఈ పిచ్‌ను మైదానంలో ముందుగానే తయారు చేసిన కాంక్రీట్ స్లాబ్‌లో అమర్చుతారు. సాధారణ పిచ్‌లను తయారు చేసిన విధానంలో డ్రాప్ ఇన్ పిచ్‌లను సిద్ధం చేస్తారు.

అవసరం ఏంటీ?:

డ్రాప్ ఇన్ పిచ్‌లు ఇప్పుడొచ్చిన టెక్నాలజీ కాదు. గత ఐదేండ్లుగా క్రికెట్ సర్క్యూట్‌లో చర్చ నడుస్తూనే ఉంది. న్యూయార్క్ వంటి క్రికెట్ సదుపాయాలు లేని స్టేడియం సహా మల్టీస్పోర్ట్స్‌కు ఆతిథ్యం ఇచ్చే స్టేడియం కోసం డ్రాప్ ఇన్ పిచ్‌లను తీసుకొచ్చారు. ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ అందులో ఒకటి. ఇక్కడ వేసవి సీజన్‌లో క్రికెట్ జరుగుతుండగా, ఆ తర్వాత ఫుట్‌బాల్ మ్యాచులు ఉంటాయి. టీ20 ప్రపంచకప్ కోసమే న్యూయార్క్‌లో డ్రాప్ ఇన్ పిచ్‌ను పెట్టారు. టోర్నీ ముగిసిన తర్వాత డ్రాప్ ఇన్ పిచ్‌ను సంబంధిత కంపెనీ తీసుకెళ్తుంది.

పిచ్ ఎలా స్పందిస్తుంది?

సాధారణ పిచ్ తరహాలో స్పందించేందుకు కాస్త సమయం పడుతుందని నిపుణుల మాట. వినియోగిస్తున్న కొద్ది గ్రౌండ్‌లో పిచ్ మరింత మెరుగ్గా కుదురుకుంటుంది. అప్పుడే సాధారణ పిచ్‌ల తరహాలో స్పందిస్తుంది. మెల్‌బోర్న్‌లో తొలుత ఈ పిచ్‌లు పేస్, బౌన్స్‌కు అనుకూలంగా లేవని విమర్శలు వచ్చాయి. ఇప్పుడు న్యూయార్క్‌లో పిచ్ పేసర్లకు ఎక్కువగా అనుకూలిస్తుందని విమర్శిస్తున్నారు. మరికొన్ని మ్యాచులు జరిగితే పిచ్ సహజశైలిలో స్పందించేందుకు అవకాశం ఉంటుంది.

ఈ పిచ్‌ను ఎక్కడ చేశారు?

డ్రాప్ ఇన్ పిచ్‌లను ఎక్కడైనా తయారు చేయవచ్చు. అవసరాలకు అనుగుణంగా తయారు చేసిన తర్వాత ఎక్కడికైనా తీసుకెళ్లవచ్చు. ప్రస్తుతం న్యూయార్క్ స్టేడియంలో అమర్చిన డ్రాప్ ఇన్ పిచ్‌లను ఆస్ట్రేలియాలోని ఆడిలైడ్‌లో సిద్ధం చేశారు. టీ20 ప్రపంచకప్ కోసం న్యూయార్క్‌కు తీసుకొచ్చి అమర్చారు. భారత్ గ్రూప్ దశలో తొలి మూడు మ్యాచులు ఈ పిచ్‌పైనే ఆడాల్సి ఉంది.

# సింధుకు చుక్కెదురు

**- తొలి రౌండ్లోనే పరాజయం**

**- ఇండోనేషియా ఓపెన్ సూపర్ 1000**

జకర్తా (ఇండోనేషియా) : పారిస్ ఒలింపిక్స్ ముంగిట ఓ టైటిల్ విజయం వేటలో పి.వి సింధుకు మళ్లీ నిరాశే ఎదురైంది. ఈ సీజన్‌లో మరోసారి భారత అగ్రశ్రేణి షట్లర్ తొలి రౌండ్లోనే పరాజయం పాలైంది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో వరల్డ్ నం.12 పి.వి సింధు 15-21, 21-15, 14-21తో పరాజయం పాలైంది. వరల్డ్ నం.26 చైనీస్ తైపీ షట్లర్ వెన్ చి చేతిలో అనూహ్య ఓటమి చవిచూసింది. 70 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో సింధు తొలి గేమ్‌లో తగ్గినా.. రెండో గేమ్‌లో పుంజుకుంది. కానీ నిర్ణయాత్మక మూడో గేమ్‌లో సింధు అంచనాలను అందుకోలేదు. 12-12తో ఓ దశలో రేసులో నిలిచినా.. ఆ తర్వాత వరుసగా ఐదు పాయింట్లు కోల్పోయి భారీ మూల్యం చెల్లించింది. యువ షట్లర్ ఆకర్షి కశ్యప్ సైతం 18-21, 6-21తో రచనాక్ ఇంటనాన్ చేతిలో ఓడింది. మహిళల డబుల్స్‌లో తనీశ క్రాస్టో, అశ్విని పొన్నప్ప జంట 21-15, 21-15తో కెనడా షట్లర్లపై విజయం సాధించారు. రుతుపర్ణ, శ్వేతపర్ణ జంట 12-21, 9-21తో వరుస గేముల్లో పరాజయం పాలై ఇంటిబాట పట్టింది.




# గాయం గురించి అప్డేట్ ఇచ్చిన రోహిత్ శర్మ..



న్యూయార్క్: టీ20 వరల్డ్‌కప్‌లో రోహిత్ శర్మ గాయపడ్డ విషయం తెలిసిందే. ఐర్లాండ్‌తో మ్యాచ్ జరిగిన సమయంలో బ్యాటింగ్ చేస్తున్నప్పుడు అతని చేయికి బంతి తగిలింది. పేస్ బౌలర్ జోష్ లిటిల్ బౌలింగ్‌లో బంతి బలంగా తగలడంతో అతను గ్రౌండ్ నుంచి రిటైర్డ్ హార్ట్‌గా వెళ్లిపోయాడు. ఆ మ్యాచ్‌లో రోహిత్ 37 బంతుల్లోనే 52 రన్స్ చేశాడు. న్యూయార్క్‌లోని నసావు కౌంటీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో పిచ్ విచిత్రంగా ప్రవర్తిస్తున్న నేపథ్యంలో.. బ్యాటర్లు ఇబ్బందులు పడుతున్నారు. కొత్త పిచ్ కావడంతో బంతులు నేరుగా బ్యాటర్ల మీదకే వస్తున్నాయి. కానీ స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన ఇండియా 8 వికెట్ల తేడాతో ఐర్లాండ్‌పై విక్టరీ కొట్టింది. 9వ ఓవర్ రెండో బంతి రోహిత్ చేయికి తగిలింది. అయితే 10వ ఓవర్‌లో అతను గ్రౌండ్ నుంచి వెళ్లిపోయాడు. ఆ గాయం సీరియస్‌గా లేదని తెలుస్తోంది. మ్యాచ్ ముగిసిన తర్వాత ఈ విషయాన్ని రోహిత్ చెప్పాడు. కాస్త నొప్పిగా ఉందని కెప్టెన్ రోహిత్ వెల్లడించాడు. ఇదే మ్యాచ్‌లో రిషబ్ పంత్‌కు కూడా 11వ ఓవర్‌లో మోచేతికి బంతి తగిలింది. ఫిజియో నుంచి ట్రీట్మెంట్ తీసుకున్న పంత్ ఇన్నింగ్స్‌ను పూర్తి చేశాడు. నసావు కౌంటీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంపై చాలా విమర్శలు వస్తున్నాయి. ఆ పిచ్‌పై బౌన్స్ ఎక్కువగా ఉన్నట్లు ఆరోపణలున్నాయి. ఇక అవుట్ ఫీల్డ్ కూడా స్లోగా ఉండడం మరో కారణమైంది. పిచ్ ఎలా ఉంటుందో చెప్పడం కష్టమని టాస్ సమయంలోనే చెప్పినట్లు రోహిత్ తెలిపాడు. కేవలం అయిదు నెలల క్రితం నిర్మించిన ఈ పిచ్ గురించి చెప్పడం కష్టమే అవుతుందన్నాడు. సెకండ్ బ్యాటింగ్ చేస్తున్నప్పుడు కూడా పిచ్ సెటిల్ కాలేదన్నాడు. సరైన లెన్త్‌లో బౌలింగ్ చేస్తే, ఇలాంటి పిచ్‌లపై వికెట్లు ఈజీగా దక్కుతాయన్నాడు. ఇక జూన్ 9వ తేదీన ఇదే పిచ్‌పై పాకిస్థాన్ జట్టుతో ఇండియా తలపడనున్నది. పాక్‌తో మ్యాచ్ సమయంలో కూడా ఇలాంటి పరిస్థితే ఎదుర్కోవాల్సి ఉంటుందని, దీని కోసం ప్రిపేర్ కావాలని, ప్రతి ఒక ప్లేయర్ తమ సత్తా చూపించాల్సి వస్తుందని రోహిత్ పేర్కొన్నాడు.

# బెస్ట్ ఫీల్డర్ అవార్డులో సూపర్ ట్విస్ట్.. ఆశ్చర్యపోయిన రోహిత్ శర్మ, కోహ్లి..



టీ20 ప్రపంచకప్‌లో టీమ్ఇండియా ఘనంగా బోణీ కొట్టింది. న్యూయార్క్‌లోని నాసావు కౌంటీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో ఐర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 8 వికెట్ల తేడాతో విజయాన్ని అందుకుంది. ఈ మ్యాచ్‌లో ఐర్లాండ్ తొలుత బ్యాటింగ్ చేసింది. 16 ఓవర్లలో 96 పరుగులకు ఆలౌటైంది. లక్ష్యాన్ని భారత్ 12.2 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి అందుకుంది. కెప్టెన్ రోహిత్ శర్మ(37 బంతుల్లో 52 రిటైర్డ్ హార్ట్) హాఫ్ సెంచరీ బాదగా రిషబ్ పంత్ (26 బంతుల్లో 36 నాటౌట్) రాణించాడు. కాగా.. భారత జట్టు మేనేజ్‌మెంట్ వన్డే ప్రపంచకప్ నుంచి బెస్ట్ ఫీల్డర్ మెడల్‌ను అందిస్తున్న సంగతి తెలిసిందే. మ్యాచ్‌లో అత్యుత్తమ ప్రదర్శన చేసిన ఫీల్డర్ కు ఈ మెడల్‌ను బహుకరిస్తూ వస్తున్నారు. తాజాగా టీ20 ప్రపంచకప్‌లోనూ దీన్ని కొనసాగిస్తున్నారు. ఐర్లాండ్‌తో మ్యాచ్‌లో అత్యుత్తమంగా ఫీల్డింగ్ చేసిన వారి పేరును డ్రెస్సింగ్ రూమ్‌లో కోచ్ దిలీప్ ప్రకటించారు.

అక్షర్ పటేల్ క్యాచ్ అండ్ బౌల్ అందుకుని జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఇక కోహ్లి అయితే మైదానంలో కదిలిన విధానం అద్భుతం. దాదాపుగా అందరూ తమ ఆటతీరుతో మెప్పించారు. అయితే.. ఈ మ్యాచ్‌లో మహ్మద్ సిరాజ్ కు ఫీల్డర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభిస్తుంది అని దిలీప్ అన్నారు. ఈ మ్యాచ్ లో సిరాజ్ మూడు ఓవర్లు వేసి 13 పరుగులు ఇచ్చి ఓ వికెట్ తీశాడు. అయితే.. ఈ మెడల్‌ను ఓ యువ అభిమాని చేత ఇప్పించడం విశేషం. సుబేక్ అనే బాలుడు నేరుగా అర్ష్‌దీప్ వద్దకు వెళ్లి అభినందనలు చెప్పాడు. ఆ తరువాత సిరాజ్ వద్దకు వెళ్లి కంగ్రాట్స్ చెప్పి మెడల్ ను అందించాడు. ఈ వీడియోను బీసీసీఐ తన సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ఈ వీడియోలో చాహల్ ఆ యువ అభిమానిని డ్రెస్సింగ్ రూమ్‌లోకి తీసుకువస్తున్న సమయంలో రోహిత్, కోహ్లి ఆశ్చర్యపోయారు. ప్రస్తుతం ఈ వీడియో వైరల్‌గా మారింది.

# పాకిస్థాన్‌ను ఓడించడానికి అరగంట చాలు- అమెరికా కెప్టెన్



టీ20 వరల్డ్ కప్-2024లో మరో ఆసక్తికర పోరుకు రంగం సిద్ధమైంది. డల్లాస్ వేదికగా గ్రూప్-ఏలో ఉన్న అమెరికా-పాకిస్థాన్ ఇవాళ తలపడనున్నాయి. భారత కాలమాన ప్రకారం ఇవాళ రాత్రి 9 గంటలకు మ్యాచ్ ప్రారంభమవుతుంది.

సూపర్-8కు అర్హత సాధించాలంటే అమెరికాకు ఈ మ్యాచ్ ఎంతో కీలకం. అయితే రన్నరప్ పాకిస్థాన్‌ను జట్టును ఓడించడం ఆతిథ్య జట్టు యూఎస్ఏకు అంత సులువు కాదు.

కానీ ఇవాళ పాకిస్థాన్‌ను ఓడిస్తామని అమెరికా కెప్టెన్ మోనాన్క్ పటేల్ ధీమా వ్యక్తం చేశాడు. పాక్‌ను చిత్తు చేయడానికి అరగంట సమయం సరిపోతుందని అన్నాడు. మైదానంలో మెరుగైన ప్రదర్శన చేస్తే ప్రత్యర్థిని ఓడించడం అంత కష్టమేమి కాదని అన్నాడు. "పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో 30-40 నిమిషాలు మేం మంచి ప్రదర్శన చేస్తే చాలు. మ్యాచ్‌ను మావైపు తిప్పుకుంటాం" అని మోనాన్క్ అన్నాడు.

టీ20 వరల్డ్ కప్ ప్రారంభానికి ముందు పాకిస్థాన్ ఐర్లాండ్, ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్ ఆడింది. ఇంగ్లండ్‌తో జరిగిన నాలుగు టీ20ల సిరీస్‌లో రెండు మ్యాచ్‌లు వర్షార్పణం అయ్యాయి. మిగిలిన రెండింట్లో పాక్ చిత్తుగా ఓడింది. ఇక ఐర్లాండ్ సిరీస్‌లో ఫేవరేట్‌గా బరిలోకి దిగిన పాకిస్థాన్ తొలి మ్యాచ్‌లో అనూహ్యంగా ఓడింది. మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో నెగ్గి సిరీస్‌ను గెలిచి పరువు కాపాడుకుంది. మరోవైపు అమెరికాను పసికూనగా భావించే పరిస్థితులు లేవు.

ప్రపంచకప్‌కు ముందు బంగ్లాదేశ్‌తో జరిగిన టీ20 సిరీస్‌కు అమెరికా కైవసం చేసుకుంది. అంతేగాక వరల్డ్ కప్ ప్రారంభ మ్యాచ్‌లో కెనడాపై రికార్డు ఛేదన సాధించింది. అదే జోరుతో పాకిస్థాన్‌పై గెలవాలని యునైటెడ్ స్టేట్స్ భావిస్తోంది.

తుది జట్లు (అంచనా)

పాకిస్థాన్: బాబర్ అజామ్ (కెప్టెన్), మహ్మద్ రిజ్వాన్, ఉస్మాన్ ఖాన్, షాదబ్ ఖాన్, అజామ్ ఖాన్, ఇఫ్తికర్ అహ్మద్, అబ్రార్ అహ్మద్, షాహిన్ అఫ్రిది, హారిస్ రవూఫ్, నసీమ్ షా

అమెరికా: మోనాన్క్ పటేల్ (కెప్టెన్), స్టీవెన్ టేలర్, ఆండ్రిస్ గౌస్, ఆరోన్ జోన్స్, కోరీ అండర్సన్, హర్మీత్ సింగ్, నితీశ్ కుమార్, జస్దీప్ సింగ్, సౌరభ్, అలీఖాన్, షాడ్లీ వాన్.

# సెమీస్‌లో అల్కరాస్

**- కాస్పర్ రూడ్‌కు వాకోవర్**

**- ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్**



పారిస్ (ఫ్రాన్స్) : ఫ్రెంచ్ ఓపెన్ పురుషుల సింగిల్స్ టైటిల్ వేట ఆసక్తికరంగా మారింది. టాప్ సీడ్, డిఫెండింగ్ చాంపియన్ నొవాక్ జకోవిచ్ ఫిట్‌నెస్ కారణాలతో టోర్నీ నుంచి నిష్క్రమించగా.. యువ ఆటగాళ్లు రొలాండ్ గారోస్ గ్రాండ్‌స్లామ్ వేటలో దూకుడు పెంచారు. మూడో సీడ్ కార్లోస్ అల్కరాస్ గార్ఫియ (స్పెయిన్) సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. బుధవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో గ్రీసు కుర్రాడు స్టెఫానోస్ సిట్సిపాస్‌పై వరుస సెట్లలోనే విజయం సాధించాడు. 6-3, 7-6(7-3), 6-4తో సిట్సిపాస్‌ను చిత్తు చేశాడు. నాలుగు బ్రేక్ పాయింట్లు సాధించిన అల్కరాస్‌కు రెండో సెట్ మినహా సిట్సిపాస్ పెద్దగా ప్రతిఘటన ఇవ్వలేదు. పాయింట్ల పరంగా 101-81తో అల్కరాస్ పైచేయి సాధించాడు. సొంత సర్వ్‌లో అల్కరాస్ 14 గేములు గెల్చుకోగా.. సిట్సిపాస్ 12 మాత్రమే గెలుపొందాడు. రెండో సెట్ టైబ్రేకర్‌కు దారితీయగా ఒత్తిడిలో పైచేయి సాధించిన అల్కరాజ్ అలవోక విజయంతో సెమీఫైనల్ బెర్త్ బుక్ చేసుకున్నాడు. ఇక టాప్ సీడ్ నొవాక్ జకోవిచ్ వాకోవర్‌తో నార్వే ఆటగాడు కాస్పర్ రూడ్‌కు లైన్ క్లియర్ అయ్యింది. రాకెట్ పట్టకుండానే క్వార్టర్‌ఫైనల్ దాటేసిన కాస్పర్ రూడ్ సెమీఫైనల్లో అడుగుపెట్టాడు. మరో క్వార్టర్‌ఫైనల్లో అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ)తో అలెక్స్ (ఆస్ట్రేలియా) పోటీపడనున్నాడు. మహిళల సింగిల్స్‌లో జాస్మిన్ పావలిన్ (ఇటలీ) సెమీఫైనల్స్‌కు చేరుకుంది. బుధవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌లో నాల్గో సీడ్ రిబకినా (కజకిస్థాన్)పై మూడు సెట్ల మ్యాచ్‌లో విజయం సాధించింది. 6-2, 4-6, 6-4తో టైటిల్ ఫేవరేట్‌ను చిత్తు చేసింది. రిబకినా పది ఏస్‌లు కొట్టినా.. జాస్మిన్ వెనక్కి తగ్గలేదు. ఏడు బ్రేక్ పాయింట్లతో రిబకినా (ఐదు బ్రేక్ పాయింట్లు)పై పైచేయి సాధించింది.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers**, (m) mulugu, mulugu. RNI NO:- TELTEL 02048/2021, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**